సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మ బొరుసు వంటివి!



లోకాయత చార్వాక

సామాజిక చైతన్య త్రైమాసపత్రిక

సంపుటి : 2 | సంచిక : 2 | ఏప్రిల్ - జూన్ 2026



హేతువాద, విప్లవ ఉద్యమ నాయకులు క్రాంతికార్‌కు జోహార్లు!

హేతువాద సంఘం నాయకులు, హేతువాదం మాసపత్రిక సంపాదకులు **క్రాంతికార్** (మచ్చా లక్ష్మయ్య) 84 సం॥ల వయస్సులో తీవ్ర అనారోగ్యంతో మే 27న ఖమ్మంలో మరణించారు.

కర్నాటకలో హోమియో వైద్యం చదివారు. ఆరు దశాబ్దాల సామాజిక, సాంస్కృతిక రాజకీయాలలో సడలని విశ్వాసంతో జీవించారు. చార్వాకాశ్రమంలో జరిగే ప్రతీ కార్యక్రమంలో పాల్గొనేవారు. ది. 16.08.2025న ఖమ్మంలో జరిగిన నాస్తిక అధ్యయన తరగతులలో పాల్గొని ఉపన్యసించారు.

క్రాంతికార్ మృతికి నాస్తిక సమాజం సంతాపం తెలియజేస్తుంది.

క్రాంతికార్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న
నాస్తిక సమాజం సభ్యులు కోటేశ్వరరావు

ప్రచురణ :
చార్వాకాశ్రమం
స్థాపితం : 1973

నిర్వహణ :
నాస్తిక సమాజం
స్థాపితం : 1968

లోకాయత - చార్వాక

ఏప్రిల్ - జూన్, 2026

గౌరవ సంపాదకులు : **డా॥ భాను ప్రసాద్**

ప్రధాన సంపాదకులు : **బి. సుధాకర్**

సహాయ సంపాదకులు :
జంజనం సత్యనారాయణ
సత్య నిర్ధారణ్
యం.యన్. బుద్ధ
వి.వి.డి.ఎస్. ప్రసాద్
లతీఫ్
నాస్తిక్ శ్రీకాంత్

రచనలు, అభిప్రాయాలు, విరాళాలు
పంపవలసిన చిరునామా :

బి. సుధాకర్
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు),
మంగళగిరి (మండలం)
గుంటూరు జిల్లా - 522 240.
సెల్ : 9290619550, 9440101814
Google Pay, Phone Pay : 9290619550
voiceofcharwaka@gmail.com

శాస్త్రీయ స్పృహను
మానవ వాదాన్ని, పరిశీలనాతత్వాన్ని,
సంస్కరణను పెంపొందించటం
ప్రతి భారతీయ పౌరుని విధి,
భారత రాజ్యాంగం
ఆర్టికల్ 51(A)(H) రూల్ IV A.

పత్రికలో ప్రచురించిన రచనలు ఆయా రచయితల అభిప్రాయాలు మాత్రమే. పత్రిక యాజమాన్యం వారి అభిప్రాయాలతో ఏకీభవించనవసరం లేదు.

For Internal Circulation only
Not for Sale

ఈ సంచికలో...

1. అతీంద్రియ శక్తులు నిరూపించే వారికి ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్థలు 3
2. బుద్ధిజం X మార్క్సిజం 14
3. ప్రాణుల పరిణామం 19
4. "సంభవామి.." 24
5. కుట్ర రాజకీయం 27
6. దేశంలో భక్తి రసం డ్రైనేజిలా ప్రవహించకుండా 29
7. మచ్చాలక్ష్మయ్య "క్రాంతికార్" ఎలా అయ్యాడు 31
8. బైబిల్ బాగోతం 34
9. మతం గుప్పిట్లో మహిళ 36
10. వైద్య విధానంలో గతితార్కిక పద్ధతి-హోమియో 38
11. ముహూర్తాలు ముష్ట 40

చెవి కమ్మలు కుట్టించుకోవడం వల్ల కామం అదుపులో వుంటుంది. ముక్కు కుట్టడం వల్ల మగపిల్లలు పుడతారు. మంగళసూత్రం వేసుకోవడం వల్ల మొగుడు మంది దగ్గరికి పోకుండా వుంటాడు. గాజులు వేసుకుంటే రుతుక్రమం సక్రమంగా వుంటుంది, కాలిపట్టీలు పెట్టుకోవడం వల్ల వేడి తగ్గుతుంది, మెట్టెలు పెట్టుకోవడం వల్ల గర్భాశయం చక్కగా వుంటుంది, వడ్డాణం పెట్టుకోవడం వల్ల సుఖ ప్రసవం అవుతుంది..

మళ్లీ వీటికి నాడులు ప్రేరేపించడం, చల్లబడడం అనే అర్థంలేని వెధవ సైన్సు కలపడం.

అప్పట్లో ఇలా రాసినవాళ్లకు, చెప్పినవాళ్లకు అప్పట్లో జ్ఞానం లేదు పైగా లాభం వుంది. మరిప్పుడే మయ్యింది? సైన్సు వుంది, ఏ నరం ఎక్కడుందో, ఏ గ్రంధి ఏం చేస్తుందో, ఏ లోహం ఏ రసాయనిక చర్యకి స్పందిస్తుందో తెలిశాక, ప్రపంచంలో మనకన్నా ఎక్కువ ఆరోగ్యం, జీవనకాలం ఎక్కువగా ఇతర దేశాలలో బ్రతుకు తున్నప్పుడు, ఇవన్నీ లేకుండానే జరుగుతున్నాయని తెలుస్తున్నా, ఇప్పుడు కూడా ఈ పైత్యాన్ని ఎట్లా ప్రచారం చేయాలనిపిస్తుంది? కనీస ఇంగితం ఎందుకుండదు? పైగా సంప్రదాయం, సనాతనం, స్థానీయం అని ఎట్లా అనాలనిపిస్తుంది?

- సిద్ధార్థి సుభాష్‌చంద్రబోస్

నాస్తిక సాహిత్యం కోసం సంప్రదించండి :
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు), మంగళగిరి, గుంటూరు జిల్లా - 522 240.
ఫోన్ : 91777 21588, https://charvaka.co.in/

అతీంద్రియ శక్తులు నిరూపించే వారికి ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్థలు ప్రకటించిన సవాళ్ళు

– సాంబశివరావు ముత్యాల

ముప్పై మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ఓ బస్సు ప్రమాదానికి గురైంది అనుకోండి. అందులో ఒక బాలుడు మాత్రమే బతికి మిగిలినవారు చనిపోయారు అనుకోండి. దానిని దేవుని మహిమగా పత్రికలు, సామాన్య జనం చిత్రీకరించటం చూస్తుంటాం. అది ఒక మిరకిల్ (miracle) గా భావిస్తారు. ఒక విధంగా ఆ పిల్లవాడు బతికి బయటపడటం ఒక అద్భుతమే. కానీ అతడు బయటపడటానికి ఏవో కొన్ని భౌతిక కారణాలు ఉంటాయి. ఇందులో దైవ ప్రమేయం ఏమీ ఉండదు. అలాగే మిగిలిన 29 మంది చనిపోవటానికి కూడా భౌతిక కారణాలు ఉంటాయి. దాదాపు అన్ని వాణిజ్య పత్రికలు, దినపత్రికలు రాశిఫలాలను ప్రచురిస్తూ ఉంటాయి. రాశి ఫలాలను అనుసరిస్తున్న వ్యక్తి రాశి ఫలాలు చెబుతున్న జోస్యం నిజం అయ్యేదానికన్నా అబద్ధం అయ్యే అవకాశాలే ఎక్కువ. కానీ, ఒకటో రెండో నిజం అయ్యే అవకాశం కూడా ఉంది. ఆ రెండు, మూడు ఫలితాల ఆధారంగా ఆ వ్యక్తి రాశిఫలాలు నిజమే అని నమ్మి, జీవితాంతం అనుసరించే అవకాశమే ఎక్కువ. ఒక విద్యార్థి పరీక్ష రాయడానికి వెళుతున్నాడని అనుకోండి. దారిలో నేలలో పాతుకుపోయిన ఒక రాయి కాలికి తగిలింది అనుకోండి. ఆ రోజు అతను పరీక్ష బాగా రాస్తే ఆ రాయి కాలికి తగలడం వలన పరీక్ష బాగా రాసానని అనుకోనే ప్రమాదం ఉంది. ఒక క్రికెటర్ ఏదో ఒక రంగు చొక్కా ధరించినప్పుడో, ఫలానా ఉంగరం ధరించినప్పుడో, ఎవరైనా కుటుంబ సభ్యుడు ఎదురొచ్చిన రోజునో సెంచరీ కొట్టాడని అనుకుందాం. తన సెంచరీకి కారణం ఫలానా చొక్కా ధరించటం వలననో, ఫలానా ఉంగరం వలననో, ఫలానా వ్యక్తి ఎదురు రావడం వలననో అని అనుకోవచ్చు. ఏదైనా ఒక కుటుంబం వాస్తు ప్రకారం ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేసిందని అనుకుందాం. గృహప్రవేశం అయిన తర్వాత కుటుంబ సభ్యులలో ఒకరు ఆకస్మికంగా కాలం చేశారని అనుకుందాం. వెంటనే కుటుంబ సభ్యులకు, వారి శ్రేయోభిలాషులకు కలిగే అనుమానం ఒక్కటే. ఇంటి వాస్తులో ఏదో దోషం ఉందని! ముందు వాస్తు చూసిన వాస్తు పండితుని పరిజ్ఞానం సరిగా లేదు అనీ, వెంటనే వారు మరో వాస్తు ప్రముఖుని సంప్రదిస్తారు. ఆయన దోష పరిహారాన్ని చెప్పి, కొంత పారితోషికం తీసుకోవడం జరుగుతుంది. అయితే పైన జరిగిన సంఘటనలనన్నిటికీ...పిల్లవాడు మరణించడం, క్రికెటర్ సెంచరీ కొట్టటం, ఇంటి యజమాని మరణించడం... ఏవో కొన్ని భౌతిక కారణాలు ఉంటాయి. మన చుట్టూ ఉన్న నమ్మకాల వలన, మనం పెరిగిన వాతావరణాన్ని బట్టి మనకు ఈ విశ్వాసాలు, నమ్మకాలు కలగడానికి అవకాశం ఎక్కువ. వీటిని ఎవరైనా ప్రశ్నిస్తే, చాలామంది మా విశ్వాసాలు మావి; మా నమ్మకాలు మావి; నీకేమిటి ఇబ్బంది? అని అంటుంటారు. చాలా మటుకు అంధ విశ్వాసాలు, సూడో సైన్సును నమ్మటం వలన అనవసరంగా కాలాన్ని వృధా పరచుకోవటం, డబ్బును కోల్పోవడం, దోపిడీకి గురవటం, అనారోగ్యాలను తెచ్చి పెట్టుకోవడం జరుగుతుంది. మూఢనమ్మకాలను పాటించడం వలన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతాం. మన చేతుల్లో ఏమీ ఉండదనే ఆలోచన కలుగుతుంది. సొంతంగా నిర్ణయాలను తీసుకోలేము. రుజువులతో కూడిన తార్కిక ఆలోచనకు బదులుగా నిరాధారమైన సిద్ధాంతాలపై ఆధారపడతాం. ఉదాహరణకు

అదృష్టం, విధి వంటి వాటిపై ఆధారపడటం. బయటకు బయలుదేరినప్పుడు ఫలానా వ్యక్తి ఎదురు వచ్చాడు కాబట్టి పని జరగలేదని వారిని నిందించడం కూడా జరుగుతుంది. ఇది మానవ హుందాతనాన్ని అవమానించటమే. ఈ మూఢనమ్మకాలను పాటించకపోతే ఏదో కీడు జరుగుతుందనే గట్టి భయం మనసుల్లో గూడు కట్టుకుంటుంది. చాలా సందర్భాల్లో బిక్కుబిక్కుమని బతకాల్సి వస్తుంది. శాంతులు, దోషపరహారాల పేరిట వేలకు వేలు పైగా డబ్బులు పోగొట్టుకోవడం సర్వసాధారణం. ఎన్నో మూఢనమ్మకాలు, మహిమలు, అతీంద్రియ శక్తులు, సూడో సైన్సులు మొదలైన వాటిని నమ్మటం వలన మన వివేచన శక్తి మసకబారుతుంది. విమర్శనాత్మక పరిశీలన మొద్దు బారుతుంది. ఇంగిత జ్ఞానం కూడా కోల్పోతాం. జాతి యావత్తూ అంధకారంలో మునిగిపోతుంది. సత్యం బలవుతుంది. తరతరాలపాటు అసత్యాలను పాటిస్తూ అబద్ధాల కోరల్లో చిక్కుకుపోతాం. మన పిల్లలకు నిజాలు చెప్పాలా? అబద్ధాలు నూరిపోయాలా? అని మనం ఆలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సత్యాన్వేషణ అత్యంత విలువైన విషయం. ప్రతి దానిని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. గుడ్డిగా దేనిని నమ్మకుండా మన ఆచరణ ఉండాలి. ప్రశ్న ప్రగతికి మూలం.

ఇప్పుడు మహిమలు, అతీంద్రియ శక్తులు, మూఢ విశ్వాసాలు, సూడో సైన్సు మొదలైన అంశాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

1. మహిమలు /అద్భుతాలు (Miracles) :మహిమలు అనేవి మనకు తెలిసిన ప్రకృతి నియమాల పరిధికి మించి వెలుపల జరిగే సంఘటనలు. అంటే ప్రస్తుతం అమలులో ఉన్న నియమాలలో దైవం లేదా దైవ జనులు జోక్యం కలగజేసుకొని ఒక ప్రత్యేక సంఘటనలో వాటిని తాత్కాలికంగా సవరించటం; మార్చటం. ఇవి మతపరమైన నమ్మకాలు లేదా విశ్వాసం ఆధారంగా భక్తులలో పాతుకుపోయిన నమ్మకాలు. ఇవి దేవుడు తన శక్తిని వెల్లడించడానికో, భక్తుల కోరికల్ని తీర్చడానికో ఉపయోగిస్తాడని విశ్వాసుల నమ్మకం. ఉదాహరణకు : కుంటివాడిని నడిపించడం, గ్రుడ్డివానికి చూపు తెప్పించడం, చనిపోయిన వారిని బతికించటం, సముద్రాన్ని రెండుగా చీల్చడం, ఆకాశంలో దేవుని చిత్రం కనపడటం, దేవుడి విగ్రహాల కన్నుల నుండి నీరు కారడం, విగ్రహాలు పాలు తాగటం మొదలైనవి.

2. అతీంద్రియ శక్తులు (Paranormal Powers) : ఇవి సాధారణ ఇంద్రియ గ్రహణ శక్తిని మించి మానవుడు ప్రదర్శించే శక్తులు. ఇతరులు ఏమి ఆలోచిస్తున్నారో తెలుసుకోవడం (telepathy), మానసిక శక్తితో వస్తువులను కదిలించడం లేదా వాటి ఆకారాలను మార్పు చేయటం (telekinesis), ఇంద్రియాతీత గ్రహణశక్తి (extrasensory perception), భూమి ఆకర్షణ శక్తికి వ్యతిరేక దిశలో గాలిలో తేలడం (levitation) మొదలైనవి ఇందుకు ఉదాహరణలు. ఇవి సైన్స్ నియమాలను ధిక్కరించేవి; సైన్సుకు వ్యతిరేకమైనవి.

3. అలౌకిక శక్తులు (Supernatural Powers) : శాస్త్రీయ నియమాలకు అతీతంగా శక్తులను ప్రదర్శించడం. సాధారణ మానవ పరిమితులను మించి శక్తులను ప్రదర్శించడం. ఇక్కడ దైవిక అంశం ఇమిడి ఉంటుంది. మత గ్రంథాలలో కనిపించే దేవుడు, దేవతలు, రాక్షసులు మొదలైన వారు ప్రదర్శించే శక్తులను ఉదాహరణలుగా చెప్పవచ్చు.

4. మూఢనమ్మకాలు / అంధ విశ్వాసాలు (Superstitions) : ఇవి నిర్హేతుకమైన నమ్మకాలు. సమాజంలో చాలా కాలంగా పాతుకుపోయిన విశ్వాసాలు. ఇవి రకరకాలుగా ఉంటాయి; అనేకం ఉంటాయి. కార్య కారణ సంబంధంతో ప్రమేయం లేకుండా పాటించే ఆచారాలు. పిల్లి ఎదురొస్తే చెడు కలుగుతుందని నమ్మటం, మంగళవారం గోళ్ళు కత్తిరించుకోరాదు అనటం, 7 అదృష్ట సంఖ్య అనుకోవటం, 13వ తేదీ గల శుక్రవారం ప్రమాదాలకు మూలం అని నమ్మటం, వాహనాలకు నిమ్మకాయలు కట్టడం, నరదృష్టి మొదలైనవి మూఢనమ్మకాలు కింద వస్తాయి. వీటిని పాటించకపోతే చెడు కలుగుతుందని ప్రజలు గాఢంగా నమ్ముతారు. పాటిస్తే వచ్చే నష్టమేమీ ఉండదని కూడా కొందరు వాదిస్తారు.

5. సూడో సైన్సు / మిథ్యా విజ్ఞాన శాస్త్రం (Pseudoscience) : స్వభావరీత్యా శాస్త్రీయ పద్ధతికి విరుద్ధంగా ఉన్నా, తమ సిద్ధాంతాలు, ప్రక్రియలు సైన్స్ పరంగా వాస్తవమని కట్టుకథలు అల్లి, సైన్సు రంగు పులిమి, సైన్స్ పదజాలం వాడుతూ జనాన్ని నమ్మించే శాస్త్రాలను సూడో సైన్సులు అని చెప్పవచ్చు. ఇవి సరైన శాస్త్రీయ శోధనకు, సరైన ఆధారాలకు, పరీక్షలకు నిలవవు. సూడో సైంటిస్టులు వివరించే భాష అర్థరహితంగా, గందరగోళంగా, తప్పుదారి పట్టించేదిగా ఉంటుంది. ఇవి కొన్ని సంఘటనల ప్రాతిపదికన మాత్రమే నియమాలు తయారు చేస్తాయి. వాటికి సార్వజనీనత ఉండదు. సూడో సైంటిస్టులు యాదృచ్ఛిక సంఘటనలపై కూడా ఆధారపడతారు. న్యూమరాలజీ, జ్యోతిష్య శాస్త్రం, గ్రాఫాలజీ వీటికి కొన్ని ఉదాహరణలు.

6. క్షుద్ర శక్తులు / తాంత్రిక శక్తులు / గూఢ శక్తులు (Occult Powers) : వ్యవస్థీకృత మతం, విజ్ఞాన శాస్త్ర పరిధికి అతీతమైన, నిగూఢమైన, రహస్య శక్తులను క్షుద్ర శక్తులు అనవచ్చు. ఉదాహరణకు ఆత్మలను ఆవాహన చేయటం, బ్లాక్ మ్యాజిక్, దయ్యాలను శరీరం నుండి పారద్రోలడం, చనిపోయిన వారితో మాట్లాడటం (Necromancy), మంత్రగాళ్లు, మంత్రగత్తెలు పాటించే శక్తులు (Witchcraft) మొదలైనవి క్షుద్ర శక్తులకు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

ఇంకా అనేక మతపరమైన డాగ్మాలు (Dogmas) కూడా ఉన్నాయి. ఇవన్నీ మానవుడిని ఆలోచనారహితంగా చేస్తున్నాయి. మానవుల్లో ఉన్న సహజ ఆలోచనా ధోరణిని పెంపొందించడానికి, ఆధారాలు లేని నమ్మకాలను, అసత్యాలను తొలగించడానికి అనేకమంది సంశయవాదులు (septics), హేతువాదులు, శాస్త్రవేత్తలు, సైన్స్ పాపులరైజర్లు, నాస్తికులు, ఆస్తికులు, మానవ వాదులు ఎంతో మంది అవిరళ కృషి చేస్తున్నారు. సత్యాన్వేషణలో భాగంగా వీరిలో చాలా మంది అనేక సవాళ్లను ప్రజలముందు ఉంచారు; ఉంచుతున్నారు. ఇందులో అవహేళన చేయటం అంటూ ఏమీ లేదు; కించపరచటం కూడా లేదు. కేవలం ప్రజలను చైతన్యపరచటమే వీరి ఉద్దేశం. వీరిలో శ్రీలంక దేశపు ప్రముఖ హేతువాది అబ్రహాం టి.కోవూరు, బెంగళూరు విశ్వవిద్యాలయ మాజీ కులపతి హెచ్. నరసింహయ్య, ప్రముఖ కెనడియన్, అమెరికన్ సంశయవాది జేమ్స్ రాండీలను ప్రముఖంగా మనం చెప్పుకోవాలి.

ముందుగా కోవూరు సవాలును చూద్దాం. ఈ సవాలును ఆయన 1963 లో ప్రకటించారు. ఈ సవాలును ఇంగ్లీషు, తెలుగు భాషల్లో చూద్దాం.

ఇంగ్లీషులో:

"I, Abraham T. Kovoor of "Tiruvalla", Pamankada Lane, Colombo-6 do hereby state that l am prepared to pay an award of 100,000 Sri Lankan rupees to any one from any part of the world who can demonstrate supernatural or miraculous powers under

fool-proof and fraud-proof conditions. This offer will remain open till my death or till I find the first winner."Godmen, Saints, Yogis, and Siddhas who claim that they acquired miraculous powers through spiritual exercises and divine boons win this award if they can perform any of the following "miracles"

1. Read the serial number of a sealed up currency note.
2. Produce an exact replica of a currency note.
3. Stand stationary on burning cinders for half a minute without blistering the feet.
4. Materialise from nothing an object I ask.
5. Move or bend a solid object using psychokinetic power.
6. Read the thought of another person using telepathic powers.
7. Make an amputated limb grow even one inch by prayer, spiritual or faith healing powers, Lourdes water, holy ash, blessing etc.
8. Levitate in the air by yogic power.
9. Stop the heart-beat for five minutes by yogic power.
10. Stop breathing for thirty minutes by yogic power.
11. Walk on water.
12. Leave the body in one place and reappear in another place.
13. Predict a future event.
14. Develop creative intelligence or get enlightened through transcendental or yogic meditation.
15. Speak or understand an unknown language as a result of rebirth or by being possessed by a spirit, holy or evil.
16. Produce a spirit or ghost to be photographed.
17. Disappear from the negative when photographed.
18. Get out of a locked room by spiritual power.
19. Increase the quantity by weight of a substance by divine power.
20. Detect a hidden object.
21. Convert water into petrol or wine.
22. Convert wine into blood.
23. Astrologers and palmists, who hoodwink the gullible by saying that astrology and palmistry are perfectly "Scientific", can win my award if they can pick out correctly—within a margin of five percent error—those of males, females, and living and the dead from a set of ten palm prints or astrological charts giving the exact time of birth correct to the minute, and places of birth with their latitudes and longitudes.

"I invite miracle performers like Satya Sai Baba, Pandrimalai Swamigal, Neelakanta Tathaji, Nirmala Devi Srivastava, Pujya Dadaji, Dattabal, Triprayar Yogini, Gurudev Anandamurthi, Kamubhai, Chinmayanand, Acharya Rajneesh, Muktanand, Swami Rama, Swami Haridas, Sivabalayogi, Bhagavan Gnanananda, Gurumaharaj-ji, Maharishi Mahesh Yogi, Hazarath Ali, Dr. Vadlaimudi, C. S. Teerthangar, R.P.Tiwari, Uri Geller, Nelya Michailova, Jeane Dixon, Sybil Leek and the numerous "professors" of astrology and palmistry in India and numerous other gurus, swamijis, mahants, acharyas, andas, babas and bhagavans who have found fresh pastures and wealthier gullibles in Western Countries, to take back up my challenge and prove to skeptics like me that they are not hoaxers."



నేను అబ్రహం టి. కోవూర్, తిరువల్ల, పమన్‌కడ వీధి, కొలంబో-6 చిరునామాలో నివసించే వ్యక్తిని ఈ ప్రకటన చేస్తున్నాను. మానవ దేవుళ్లు, సన్యాసులు, యోగులు, సిద్ధులు, అమ్మలు, దేవతలు ఎవరైనా సరే మా వైజ్ఞానిక పరిశీలకులకు సహకరిస్తూ వారి వారి మహిమలు, దైవశక్తులు, మాయలు, మంత్రాలు, అతీంద్రీయ శక్తులు, మానవాతీత అద్భుతాలు నిరూపించుకుంటే శ్రీలంక కరెన్సీలో లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తాను.

ఇందులో మోసాలు, గిమ్మిక్కులు, మభ్యపెట్టడాలు ఉండకూడదు. వాస్తవంగా, నిజాయితీగా చేసి చూపాలి. అది వారి తపస్సు వల్ల లభించిందో, ఆధ్యాత్మిక చైతన్యం వల్ల అబ్బిందో, పుట్టుకతోనే ఉందో ఏమైనా కావొచ్చు. వైజ్ఞానిక పరీక్షలకు లోబడి పరీక్షలో పాల్గొనాల్సి వుంటుంది. ఈ ఛాలెంజ్ నేను చనిపోయే దాకా వుంటుంది. లేదా అతీంద్రియ శక్తులు నిరూపించుకున్న మొదటి వ్యక్తిని ప్రకటించేదాకా వుంటుంది.

వారు అభ్యసించిన 'కళలు' కాకుండా, నేను సూచిస్తున్న ఈ క్రింది 'మహిమలు' చేసి చూపాలి.

1. కవరులో సీలు చేసిన కరెన్సీ నోట్ల నెంబర్లు చెప్పాలి.
2. ఒక కరెన్సీ నోటును సృష్టించాలి.
3. కాళ్లు కదపకుండా మండుతున్న మంట మీద అర నిమిషం నిలబడాలి.
4. శూన్యం లోంచి నేనడిగిన వస్తువును తీసివ్వాలి.
5. సైకోకైనటిక్ శక్తి (మానసిక తీవ్రత)ని ఉపయోగించి ఇచ్చిన ఘన పదార్థాన్ని వంచడం గానీ, రెండుగా విరవడం గానీ చెయ్యాలి.
6. మీ టెలిపతి (మానసిక ఊహాశక్తి)తో ఎదుటి వారు ఏం ఆలోచిస్తున్నారో చెప్పాలి.
7. తెగిన చెయ్యినో, కాలునో కనీసం ఒక అంగుళమైనా పెంచగలగాలి. మీరు ప్రార్థన చేస్తారా, భస్మం చల్లుతారా, మంత్ర తంత్ర విద్యలు ఉపయోగిస్తారా లేక విశ్వాసంతో నయం చేయడం వంటి 'ఫెయిత్ హీలింగ్'ను ఉపయోగిస్తారా-ప్రయోగిస్తారా మీ ఇష్టం! ఏ వ్యక్తిదైనా తెగిన అవయవం కనీసం ఒక్క అంగుళం పెరిగేట్లు చెయ్యాలి.
8. మీ యోగ శక్తితో గాలిలో తేలి చూపాలి.
9. మీ యోగ బలంతో ఎదుటివాడి హృదయ స్పందనని ఒక అయిదు నిమిషాలు ఆపాలి.
10. మీ యోగ శక్తితో మీరు అరగంట ఊపిరి పీల్చకుండా ఉండాలి.
11. నీటి మీద నడవాలి.
12. శరీరాన్ని ఒక చోట వదిలేసి, మరో చోట ప్రత్యక్షమవ్వాలి.
13. భవిష్యత్తులో జరగబోయే ఒక సంఘటనను యథాతథంగా వివరించాలి.
14. మెడిటేషన్ వల్లగానీ, మీ సర్వోత్కృష్టమైన మహిమ వల్లగానీ సృజనాత్మకతను మేల్కొల్పాలి.
15. గత జన్మలోని అనుభవం వల్లగానీ, తిరుగాడే మీ ఆత్మని ఉత్తేజపరిచి గాని మీకు తెలియని ఒక భాష మాట్లాడాలి.
16. ఆత్మను గానీ, దయ్యాన్ని గానీ ఫొటో తీసి చూపాలి.
17. మిమ్మల్ని ఫొటో తీసినప్పుడు ఫొటో నెగటివ్ లోంచి మీరు కనబడకుండా పోవాలి.
18. మీ ఆత్మ శక్తితో, ఆధ్యాత్మిక బలంతో, సాధించిన సిద్ధితో ఎలాగైనా సరే-మిమ్ములను గదిలో వేసి తాళం పెడితే బయటికి రావాలి.
19. మీలోని దైవత్వ శక్తి ప్రదర్శించి మీరున్న ప్రస్తుత బరువు కన్నా ఎక్కువ బరువు తూగి చూపాలి.

20. దాచిన వస్తువుల్ని కనుగొనాలి.
21. నీటిని పెట్రోలు గానో, సారాయి (లిక్కరు) గానో మార్చాలి.
22. సారాయిని రక్తంగా మార్చాలి.
23. పది మంది అర చేతి ముద్రలు ఇస్తాం. వారు పుట్టిన సమయం–వారి దేశ కాలమాన ప్రకారం చెప్పాలి. అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా పుట్టిన చోటు సరిగ్గా చెప్పాలి. వారి వారి ప్రధాన జీవన సంఘటనలు చెప్పాలి.

దీని కోసం హస్త సాముద్రిక నిపుణుల్ని, జ్యోతిష్యుల్ని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నాను. వారు చెప్పేదంతా 'శాస్త్రం' అని చెప్పుకుంటూ ఉంటారు కదా? అది నిరూపించుకోవాలని కోరుతున్నాను.

నేను ఈ కింది వారిని సగౌరవంగా ఆహ్వానిస్తున్నాను. వారు, వారి వారి మహిమలు నిరూపించుకొని, తాము సామాన్యులం కాదని, భగవత్ స్వరూపులమని రుజువు చేసుకోవాలి. దీనివల్ల ప్రపంచ పౌరుల దృష్టిలో వారి విలువ పెరుగుతుంది. వివాదాస్పద అంశాలకు తెర పడుతుంది.

సత్యసాయి బాబా, ఆచార్య రజనీశ్, మహర్షి మహేష్ యోగి, హజ్రత్ అలీ, డా॥ వడ్లమూడి, యూరి గెల్లర్, జాన్ డిక్సన్, సైబిల్ లీక్ వగైరా వగైరా (ఈ విధంగా డా॥ అబ్రహాం టి. కోవూర్ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధులైన వారివి ముప్పయి పేర్లు రాశారు. వారెవ్వరూ ఆయన సవాల్‌కు స్పందించలేదు).

1978లో అబ్రహాం కోవూరు మరణం తర్వాత ప్రముఖ సంశయవాది, హేతువాద ఉద్యమకారుడు బసవ ప్రేమానంద్, కోవూరు సవాలును కొనసాగించారు. ఆయన దైవ పురుషులు చేసే అద్భుతాలను, కుంభకోణాలను బట్టబయలు చేయడానికి, ప్రజలలో ప్రమాదకరమైన మూఢనమ్మకాలపై అవగాహన కలిగించడానికి ఆయన కృషి చేశారు. ప్రేమానంద్ భారతదేశ CSICOP (Committee for Scientific Investigation of Claims of the Paranormal) శాఖ కన్వీనర్. ఆయన మానసిక శక్తులను, అతీంద్రియ శక్తులను ప్రదర్శించగలిగే వారికి లక్ష రూపాయలు బహుమతిని ప్రకటించారు.

ప్రముఖ హేతువాది, భౌతిక శాస్త్రవేత్త, బెంగళూరు విశ్వవిద్యాలయం మాజీ కులపతి హెచ్. నరసింహయ్య (Hosur Narasimhaiah) 1976లో మహిమలను, మూఢవిశ్వాసాలను పరీక్షించడానికి ఒక కమిటీని స్థాపించారు. దాని పేరు 'కమిటీ టు ఇన్వెస్టిగేట్ మిరకిల్స్ అండ్ అదర్ వెరిఫైయబుల్ సూపర్ స్టిషన్స్ (Committee to Investigate Miracles and other Verifiable Superstitions). ఈ కమిటీలో ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, హేతువాదులు సభ్యులుగా ఉన్నారు. నియంత్రితమైన పరిస్థితులలో తమ మహిమలను ప్రదర్శించమని ఆ కమిటీ దైవ పురుషుడు సత్యసాయి బాబాకు లేఖ రాసింది. అయితే ఆయన దానికి తగిన విధంగా స్పందించలేదు. తమ అభ్యర్థనకు సత్య సాయిబాబా మిన్నకుండటాన్ని బట్టి బాబా మహిమలు బూటకమని తేలుతున్నదని నరసింహయ్య అన్నారు. ఈ కమిటీ 1977లో రద్దయింది. ప్రొఫెసర్ పాల్ కర్జ్ ఏర్పాటు చేసిన కమిటీ ఫర్ సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ద క్లెయిమ్స్ ఆఫ్ ద పారనార్మల్ (CSICOP) లో భారతదేశం తరఫున నరసింహయ్య ఒకరే ప్రతినిధి. నరసింహయ్య దైవజనులు శివ బాలయోగి, సాయి కృష్ణ మోసాలను బహిర్గతం చేశారు.



ఇప్పుడు ప్రముఖ ఇంద్రజాలకుడు, సంశయవాది జేమ్స్ రాండి (James Randi) ఈ రంగంలో చేసిన కృషిని గురించి తెలుసుకుందాం. ముందుగా ఆయనకు స్ఫూర్తినిచ్చిన వారిని గురించి తెలుసుకుందాం. ఇంద్రజాలికుడు జాన్ నెవిల్ మస్కెలైన్ (John Nevil Maskelyne) అతీంద్రియ శక్తుల పరిశోధనకు 1914లో క్షుద్ర శక్తుల కమిటీ (Occult Committee) ని స్థాపించాడు. ఆయన లయెనిల్ వెదర్లీతో కలిసి Supernatural? అనే పుస్తకాన్ని రచించాడు. ప్రముఖ ఇంద్రజాలకుడు, ఎస్కేపాలజిస్ట్, ఇల్యూషనిస్ట్ హారీ హౌడిని (Harry Houdini) 1920లలో అతీంద్రియ శక్తులు ఉన్న వారిని, మాధ్యమాలను (mediums) బహిర్గత పరచటానికి, వారు ప్రజలను ఎలా దోపిడీ చేస్తున్నారో తెలపడానికి తన కృషిని ప్రారంభించాడు. అతీత శక్తులను ప్రదర్శించే వారికి నగదు బహుమతిని అందించే 'సైంటిఫిక్ అమెరికన్' కమిటీలో ఆయన సభ్యుడు. కానీ ఆయన ముందు ఎవరూ తమ అతీంద్రియ శక్తులను ప్రదర్శించలేక పోయారు. మస్కెలైన్, హౌడినీలను స్ఫూర్తిగా తీసుకొని జేమ్స్ రాండి లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థ జేమ్స్ రాండి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (James Randi Educational Foundation) ను 1996లో స్థాపించారు. ఈ సంస్థ ఉద్దేశం రుజువులేని లేదా రుజువు కాని క్లెయిములు పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచటం; నియంత్రిత కండిషన్లను అనుసరించి అతీంద్రియ శక్తులను పరిశోధించడం. అతీంద్రియ శక్తులను ప్రదర్శించే వారికి తొలుత 1996లో 1000 డాలర్ల బహుమతితో సవాలును ప్రారంభించారు. ఆ తర్వాత బహుమతి సొమ్మును ఒక మిలియన్ డాలర్లకు పెంచారు. దీనిని మిలియన్ డాలర్ పారానార్మల్ ఛాలెంజ్ (One Million Dollar Paranormal Challenge) అంటారు. అంగీకరించిన శాస్త్రీయ పద్ధతిలో ఎవరైనా అతీంద్రియ శక్తులను పరీక్ష కోసం ప్రదర్శించవచ్చు. కానీ ఏ ఒక్కరు కూడా ప్రిలిమినరీ పరీక్షను కూడా దాటలేకపోయారు. అయితే రాండి తాను ఫౌండేషన్ నుండి పదవీ విరమణ చేసిన తర్వాత అతీంద్రియ శక్తుల నిరూపణ సవాలును 2015 లో అధికారికంగా నిలిపివేశారు. సంస్థను విరాళాలు ఇచ్చే సంస్థగా మార్పు చేశారు. రాండీ బూటకపు శక్తులపై "An Encyclopedia of Claims, Frauds, and Hoaxes of the Occult and Supernatural" అనే పుస్తకాన్ని రచించారు. దీనిని ఆన్లైన్లో ఉచితంగా చదువుకోవచ్చు.

ప్రస్తుతం సవాళ్లను కొనసాగిస్తున్న సంస్థల గురించి తెలుసుకుందాం.

1. **సెంటర్ ఫర్ యింక్వయిరీ ఇన్వెస్టిగేషన్స్ గ్రూప్ (Centre for Inquiry Investigations Group) (CFIIG) పారానార్మల్ ఛాలెంజ్**: ఈ గ్రూపు ఏదైనా పారానార్మల్, అతీంద్రియ శక్తులను లేదా క్షుద్ర శక్తిని ప్రదర్శించగలిగిన ఎవరికైనా ఐదు లక్షల డాలర్ల బహుమతిని అందిస్తుంది. ఇది లాస్ ఏంజెల్స్‌లోని సిఎఫ్ఐ వెస్ట్‌లోగాని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ అనుబంధ సంస్థల ద్వారా గాని పరీక్షలు నిర్వహిస్తుంది. అతీంద్రీయ శక్తులను ప్రదర్శించే ఏ వ్యక్తినైనా ఈ గ్రూపు వద్దకు రిఫర్ చేసిన వారికి సైతం ఐదు వేల డాలర్ల బోనస్ బహుమతి ఉంటుంది. వీరేమీ అతీంద్రియ శక్తులు ప్రదర్శించనక్కర్లేదు. అయితే అతీంద్రియ

శక్తిని ప్రదర్శించిన వ్యక్తి పరీక్షలో విజయం సాధిస్తేనే ఈ బోనస్ బహుమతిని ఇస్తారు. ఇప్పటివరకు ఈ రెండు బహుమతులు గెలుచుకున్న వారు లేరు.

2. **ఆస్ట్రేలియన్ స్కెప్టిక్స్ (Australian Skeptiks):** ఇది ఒక సమాఖ్య సంస్థ. 1980లో స్థాపించినప్పటి నుండి వీరు అతీంద్రియ శక్తులను పరిశోధిస్తున్నారు. తొలుత దీనిని నీటి జాడను తెలిపిన వారికి (water diviners) ఉద్దేశించారు. తొలుత బహుమతి సొమ్ము యాభై వేల ఆస్ట్రేలియన్ డాలర్లు. తరువాత అతీంద్రియ శక్తులు, సూడో సైన్సు క్లెయిములను పరిశోధించడం ప్రారంభించారు. బహుమతి సొమ్మును లక్ష ఆస్ట్రేలియన్ డాలర్లకు పెంచారు. ఒకవేళ ఎవరైనా అతీంద్రియ శక్తులను ప్రదర్శించే వ్యక్తిని నామినేట్ చేసిన సందర్భంలో ఆ వ్యక్తి విజయం సాధిస్తే బహుమతి సొమ్ము నుండి 20% సొమ్మును నామినేట్ చేసిన వ్యక్తికి ఇస్తారు. ఇప్పటివరకు వీరి సవాలును గెలుచుకొని ఎవరూ ప్రకటించిన సొమ్మును పొందలేకపోయారు. ఈ సవాలు ప్రస్తుతం ఆస్ట్రేలియా వాసులకు మాత్రమే పరిమితం.
3. చెక్ రిపబ్లిక్ చెక్ వారి **సంశయవాదుల క్లబ్ సిసిఫోస్ (Czech Skeptik's Club Sisofys):** ప్రకటించిన బహుమతి సొమ్ము 3,515,000 చెక్ కొరూనా. టెలిపతి, టెలికైనెసిస్, రాబ్డోమాన్సీ మొదలైన రంగాలలో అతీంద్రియ సామర్థ్యాలను కలిగి ఉన్నట్లు నిరూపించగల ఎవరికైనా.
4. చైనా దేశపు **సీమా నాన్ (Sima Nan)** ప్రకటించిన బహుమతి సొమ్ము 10,00,000 చైనీస్ యువాన్. మోసం చేయకుండా "ప్రత్యేక సామర్థ్యం" ఉన్న ఒక చర్యను చేయగల ఎవరికైనా.
5. భారతదేశపు **తర్కషీల్ సొసైటీ (Tarksheel Society)**: ప్రకటించిన సొమ్ము 10,000,000 రూపాయలు. నిర్దిష్ట "అద్భుతాలు" చేయగల ఎవరికైనా. ప్రవేశ రుసుము 10,000 రూపాయలు.
6. **భారతదేశపు సైన్స్ అండ్ రేషనలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (Science and Rationalist's Association of India)**: ప్రకటించిన సొమ్ము 50,00,000 రూపాయలు. ఎలాంటి మోసం/యుక్తి సహాయం తీసుకోకుండా ప్రకటించిన కార్యకలాపాలలో ఏదైనా ఒకదాన్ని చేయడం ద్వారా తన అతీంద్రియ శక్తిని ప్రదర్శించగల ఈ ప్రపంచంలోని ఏ వ్యక్తికైనా ప్రబీర్ ఘోష్ బహుమతిని ప్రదానం చేస్తారు.
7. ఇటలీ దేశపు **ఆల్ఫ్రెడో బర్రాగో పందెం (Alfredo Barrago's Bet):** ప్రకటించిన సొమ్ము 50,000 యూరోలు. అతీంద్రియ స్వభావం గల మాధ్యమాలు మొదలైనవారి శక్తుల నిరూపణకు.
8. బెల్జియం దేశపు **SKEPP (Study Circle for the critical evolution of pseudoscience and the Paranormal) సిసిఫస్ బహుమతి** : ప్రకటించిన సొమ్ము 25,000 యూరోలు.
9. గ్రేట్ బ్రిటన్ దేశపు **సంశయ విచారణ సంఘం (Association for Skeptical Enquiry):** ప్రకటించిన సొమ్ము 12,000 బ్రిటిష్ పౌండ్లు. మానసిక శక్తుల రుజువు కోసం.
10. రష్యా దేశపు **హ్యారీ హౌడిని బహుమతి (Harry Houdini Prize):** ప్రకటించిన బహుమతి సొమ్ము 1,000,000 రష్యన్ రూబుల్స్. శాస్త్రీయ ప్రయోగ పరిస్థితులలో పారానార్మల్ లేదా అతీంద్రియ సామర్థ్యాలను ప్రదర్శించినందుకు.

11. యునైటెడ్ స్టేట్స్ దేశపు **ఉత్తర టెక్సాస్ సంశయవాదులు (North Texas Skeptiks):** ప్రకటించిన బహుమతి సొమ్ము 12,000 అమెరికన్ డాలర్లు. ఏదైనా మానసిక లేదా అతీంద్రియ శక్తి లేదా సామర్థ్యాన్ని ప్రదర్శించగల ఏ వ్యక్తికైనా.

12. గ్రేట్ బ్రిటన్ దేశపు **ఏషియన్ రేషనలిస్ట్ సొసైటీ ఆఫ్ బ్రిటన్ (Asian Rationalist Society of Britain):** ప్రకటించిన బహుమతి సొమ్ము 10,000 బ్రిటిష్ పౌండ్లు. మీడియా మరియు శాస్త్రవేత్తల ముందు మాంత్రిక శక్తులు ఉన్నాయని నిరూపించుకోగల ఏ వ్యక్తికైనా.

13. ఎస్టోనియా దేశపు **ఎస్టి స్కెప్టిక్ (Eesti Skeptik)**: ప్రకటించిన బహుమతి సొమ్ము 10,000 యూరోలు. అతీంద్రియ శక్తులను నిరూపించగల ఎవరికైనా.

14. జర్మనీ దేశపు **GWUP:** ప్రకటించిన బహుమతి సొమ్ము 10,000 యూరోలు. అతీంద్రియ శక్తులను నిరూపించగల ఎవరికైనా.

15. ఫిన్లాండ్ దేశపు **ఫిన్నిష్ అసోసియేషన్ ఆఫ్ స్కెప్టిక్స్ (Finnish Association of Skeptiks):** ప్రకటించిన బహుమతి సొమ్ము 10,000 యూరోలు. అతీంద్రియ దృగ్విషయాలను ప్రదర్శించే వారికి.

16. నెదర్లాండ్స్: **స్టిచింగ్ స్కెప్సిస్ (Stitchting Skepsis):** ప్రకటించిన బహుమతి సొమ్ము 10,000 యూరోలు. ప్రత్యామ్నాయ రోగ నిర్ధారణల నిరూపణకు. ఉదా. అప్లైడ్ కైనిసియాలజీ, ఎలక్ట్రోఆక్యుపంక్చర్, బయోరెసొనెన్స్ థెరపీ, థెరప్యూటిక్ టచ్, ఆరాలను గమనించడం, ఇరిడాలజీ, పెండ్యులమ్ డౌసింగ్, జ్యోతిష్యం సహా.

17. స్వీడన్ : **స్వీడిష్ హ్యూమనిస్ట్ అసోసియేషన్ (Swedish Humanist Association):** ప్రకటించిన బహుమతి సొమ్ము 100,000 స్వీడిష్ క్రోనా. శాస్త్రీయ వివరణ కనుగొనలేని పారానార్మల్ లేదా అతీంద్రియ సామర్థ్యాన్ని ప్రదర్శించగల ఎవరికైనా.

18. కెనడా దేశపు **Sceptiques du Quebec** : ప్రకటించిన బహుమతి సొమ్ము 10,000 కెనడియన్ డాలర్లు. అసాధారణ దృగ్విషయం నిరూపణ.

19. శ్రీలంక :**శ్రీలంక హేతువాద సంఘం (Sri Lankan Rationalist Association)**: ప్రకటించిన బహుమతి సొమ్ము 10,00,000 శ్రీలంక రూపాయలు. ప్రొఫెసర్ కార్లో ఫోన్సెకా అబ్రహం కోవూరు సవాలును పునరుద్ధరించారు.

20. భారతదేశపు **భారతీయ సంశయవాది (Indian Skeptic, Indian CSICOP)**: ప్రకటించిన బహుమతి సొమ్ము 1,00,000 రూపాయలు. గతంలో 2009లో మరణించిన బసవ ప్రేమానంద్ దీనికి మోడరేటర్‌గా వ్యవహరించారు. 1976 లో అబ్రహాం కోవూర్ క్యాన్సర్‌తో అనారోగ్యానికి గురైన తర్వాత దీనిని అందించారు. 2009లో ప్రేమానంద్ మరణించిన తర్వాత, ఆయన పత్రిక మరియు సంస్థ ఈ ఛాలెంజ్‌ను కొనసాగించాయి.

21. భారతదేశపు **ఇండియన్ రేషనలిస్ట్ అసోసియేషన్ (Indian Rationalist Association):** ప్రకటించిన బహుమతి సొమ్ము 1,00,000 రూపాయిలు.

22. మెక్సికో దేశపు **డేనియల్ జెపెడా (Daniel Zepeda):** ప్రకటించిన బహుమతి సొమ్ము 20,000 మెక్సికన్ పెసోలు. సరైన పరిశీలన మరియు పునరావృతమయ్యే పరిస్థితులలో, విజ్ఞాన శాస్త్రానికి సమాధానం లేని పారానార్మల్, అతీంద్రియ లేదా క్షుద్ర శక్తికి సంబంధించిన సాక్ష్యాలను చూపించగల ఎవరికైనా.

23. **యునైటెడ్ స్టేట్స్ దేశపు టాంపా బే స్కెప్టిక్స్** (Tampa Bay Skeptiks): ప్రకటించిన సొమ్ము 1000 అమెరికన్ డాలర్లు. పరస్పరం అంగీకరించిన పరిశీలన పరిస్థితులలో ఏదైనా అతీంద్రియ దృగ్విషయాన్ని ప్రదర్శించగల ఎవరికైనా.

24. **న్యూజిలాండ్ దేశపు NZ సంశయవాదులు & NZ హేతువాదులు మరియు మానవవాదుల సంఘం (NZ Skeptiks and NZ Association of Rationalists and Humanists):** ప్రకటించిన సొమ్ము 100,000 న్యూజిలాండ్ డాలర్లు. అతీంద్రియ లేదా పారానార్మల్ సామర్థ్యం ఉందని నిరూపించుకోగల ఎవరికైనా.

విరమించిన సవాళ్లు కొన్ని:

జేమ్స్ రాండీ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఒన్ మిలియన్ డాలర్ ఛాలెంజ్, ఇంటర్నేషనల్ జెటీటిక్ ఛాలెంజ్, జోసెఫ్ డన్నిగర్ ఛాలెంజ్, పారానార్మల్ ఇన్వెస్టిగేటింగ్ కమిటీ ఆఫ్ ఫిట్స్ బర్గ్ ఛాలెంజ్, సైంటిఫిక్ అమెరికన్ ఛాలెంజ్, కోవూరు సవాలు మొదలైనవి.

మనం చర్చించుకొన్న అంధ విశ్వాసాలను రూపుమాపేందుకు మనం అనేక చర్యలు చేపట్టాలి. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం ఇందులో ముఖ్యమైనది. అంటే, గుడ్డి నమ్మకానికి బదులుగా ఉత్సుకత (curiosity), విమర్శనాత్మక ఆలోచన, మరియు సాక్ష్యాధారిత తార్కికత పట్ల నిబద్ధతతో కూడిన మనస్తత్వాన్ని పెంపొందించుకోవడం. ఇందులో ప్రశ్నలు అడగడం, సమాచారాన్ని నిష్పక్షపాతంగా విశ్లేషించడం, కొత్త వాస్తవాల ఆధారంగా మన అభిప్రాయాలను సవరించుకోవడానికి సిద్ధంగా ఉండటం వంటివి ఉంటాయి. మన రోజువారీ జీవితంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి ఆచరణీయమైన మరియు సులభమైన మార్గాలు: 1. ప్రశ్నించే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలి. 2. ఒక విషయాన్ని విశ్వసించే ముందు, అది ఎలా మరియు ఎందుకు అని అడిగే అలవాటును పెంపొందించుకోవాలి. 3. మన సొంత నమ్మకాలకు విరుద్ధంగా ఆధారాలు దొరికితే వాటిని మార్చు కోవాలి. 4. తెలియని దానిని తెలియదు అని ఒప్పుకోవాలి. "నాకు తెలియదు, తెలుసుకుంటాను" అనే పంథాను స్వీకరించాలి. 5. మన జ్ఞానంలో ఉన్న లోపాలను అంగీకరించడానికి సంకోచించకూడదు. 6. కొత్త విషయాలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి.

ముగింపు:

అనేక సంస్థలు బూటకపు శక్తులను, అంధ విశ్వాసాలను ప్రశ్నిస్తూ తమ తమ సవాళ్లను ప్రకటించాయి. తమ సవాళ్లకు బహుమతులు కూడా ప్రకటిస్తున్నాయి. వారి సవాళ్లకు ఎందరో సైన్సు వాదులు, సంశయవాదులు, హేతువాదులు, మానవవాదులు, నాస్తికులు మద్దతు ప్రకటిస్తున్నారు. వీరంతా బడా బడా నకిలీ బాబాలను, గురువులను, సూడోసైంటిస్టులను ప్రశ్నిస్తున్నారు; నిలదీస్తున్నారు. బహుమతి గురించి కాకపోయినా, తాము ప్రకటిస్తున్న; 'కనపరుస్తున్న' శక్తులను ఫూల్– ప్రూఫ్, ఫ్రాడ్–ప్రూఫ్ షరతులతో తాము సత్యమని చెబుతున్న

విషయాలను ప్రదర్శించి, తమ అనుచరులకు, భక్తజనాలకి ఏ సంశయం లేకుండా వారు చేయాల్సి ఉంది. అదే అసలైన సత్యనిరూపణ కూడా. అలా చేయలేని పక్షంలో తమ శక్తులను అసత్యాలని ప్రకటించాలి. విజ్ఞాన శాస్త్రాలను కలుషితం చేయకుండా చూడాలి.

సైన్సువాదులు, నాస్తికులు, హేతువాదులు, మానవవాదులు తమ శక్తివంచన లేకుండా పారానార్మల్ సవాళ్లను ప్రజాబాహుళ్యంలోకి తీసుకువెళ్లాలి; వాటికి విస్తృతంగా ప్రచారం కల్పించాలి. కోవూరు, నరసింహయ్య, రాండి వంటి సైన్స్ ప్రేమికులు ఎంతో బలీయమైన రాజకీయ నాయకుల, మతవాదుల మద్దతు ఉన్న బడా బడా బూటకపు దైవజనులను, నకిలీ బాబాలను ఎంతో ధైర్యంగా ఎదుర్కొని, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సైన్సుకు ఆసరాగా నిలిచారు. వారి వారసత్వాన్ని మనం అంతా కొనసాగించాలి. సమాజాన్ని మౌఢ్యం నుంచి బయట పడేయాలి. ప్రజలంతా ఎటువంటి సంకెళ్లు లేకుండా స్వేచ్ఛగా, హేతుబద్ధంగా ఆలోచించేలా చేయాలి. సత్యాన్ని నిత్యజీవితంలో ఆచరించేలా చూడాలి.

ఇక్కడ మనం దేశంలో మౌఢ్యంపై ధైర్యంగా పోరాడి ప్రాణాలర్పించిన త్యాగధనులను కూడా స్మరించుకోవాలి. డాక్టర్ నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారే, ఎం.ఎం. కల్బుర్గి, గౌరీ లంకేష్ లు భారత దేశంలో మౌఢ్యానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి మతోన్మాదుల తూటాలకు బలయ్యారు. నరేంద్ర దభోల్కర్ నాయకత్వంలో మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన సమితి (Maharashtra Andhshraddha Nirmulan Samiti/MANS) ద్వారా మహారాష్ట్రలో యాంటీ బ్లాక్ మ్యాజిక్ చట్టాన్ని (Maharashtra Prevention and Eradication of Human Sacrifice, other Inhuman and Aghori Practices and Black Magic Act, 2013) సాధించుకోగలిగారు. భారతదేశంలో ఈ చట్టాన్ని సాధించిన మొదటి రాష్ట్రం మహారాష్ట్ర. కర్ణాటక, గుజరాత్‌లు మహారాష్ట్ర బాటలో నడిచాయి. ఇటువంటి చట్టం ప్రతి రాష్ట్రంలో ఏర్పరచుకునేలా సైన్సు వాదులు, సైన్సు ప్రచారకులు, హేతువాదులు, నాస్తికులు, మానవవాదులు, వామపక్షవాదులు కలిసికట్టుగా కృషి చేయాలి. అప్పుడే ప్రజలకు మూఢ విశ్వాసాల నుండి, అంధ విశ్వాసాల నుండి విముక్తి.

డాక్టర్ అబ్రహాం టి. కోవూరు కొటేషన్లు:

He who does not allow his miracles to be investigated is a crook; He who does not have the courage to investigate a miracle is a gullible; and he who is prepared to believe without verification is a fool!

Nobody has and nobody ever had supernatural powers. They exist only in the pages of scriptures and sensation-mongering newspapers. జై విజ్ఞాన్!

హేతువాదం అనే తాత్విక విధానాన్ని విశ్వసించి అనుసరించేవారిని హేతువాదులు అంటారు. హేతువు అంటే కారణం అని అర్థం. ఏదైనా ఒక విషయాన్ని గుడ్డిగా విశ్వసించకుండా దానికి కారణాలను అన్వేషించడం లేదా ఆరా తీయడాన్ని హేతువాదం అంటారు. జ్ఞానానికి లేదా ఋజువుకు "హేతువు" లేదా "కారణం" అనేది మాత్రమే నమ్మదగిన ఆధారం అని భావించే తాత్విక ధోరణిని హేతువాదం అంటారు. **ఆస్తిక హేతువాదులు** : మతంలో ఉంటూనే అహేతుక విషయాలను ప్రశ్నిస్తూ ఉంటారు. మూఢాచారాలను సంస్కరించాలని చూస్తారు. **నాస్తిక హేతువాదులు** : దేవుడిని పూర్తిగా ఒప్పుకోరు. ప్రతి దానికీ కారణం ఉంటుందని నమ్ముతారు.

- సురేందర్ ఉయ్యాల

బుద్ధిజం × మార్క్సిజం



సిద్ధార్థుడు అనే గౌతమ బుద్ధుడు క్రీ.పూ. 563లో నేపాల్‌లోని కపిలవస్తు పట్టణంలో ఒక శాక్య క్షత్రియ వంశంలో జన్మించాడు. ఇనుప యుగపు వ్యవసాయ సమాజంలో నివసించాడు. బుద్ధుని బోధనలు బౌద్ధ మతమైనాయి.

కారల్ మార్క్స్ 1818 మే 5న జర్మనీలోని ట్రయర్ నగరంలో జన్మించాడు. యూరోపియన్ పారిశ్రామిక సమాజంలో నివసించాడు. మార్క్స్ సిద్ధాంతాల్ని మార్క్సిజం అంటారు. ఇద్దరి మధ్య 2371 సంవత్సరాల తేడా వుంది.

ఇద్దరూ పుట్టి పెరిగిన సామాజిక, ఆర్థిక పరిస్థితులు వేరు. అయినా బుద్ధుడు 'ఇండియన్ మార్క్స్' అని, మార్క్స్ చెప్పింది ఆనాడే బుద్ధుడు చెప్పేశాడని కొందరు వాదిస్తున్నారు. బౌద్ధాన్ని, మార్సిజాన్ని ఒకే గాట కట్టటానికి ప్రయత్నిస్తున్నారు. ఏ కాలంలో ఏ సామాజిక వ్యవస్థలో ఇవి ఆవిర్భవించాయో చూడ నిరాకరిస్తున్నారు.

బౌద్ధ మతం

బౌద్ధానికి ముందున్నది వైదికయుగం. ఈ యుగంలో వర్ణ వ్యవస్థ వుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా సమాజం విడిపోయింది. బ్రాహ్మణులు, క్షత్రియులు అగ్రవర్ణాలవారు, పాలకులు. వైశ్యులు వ్యవసాయదారులు. చేతిపనివారు, శూద్రులు పై మూడు వర్ణాలకి సేవలు చేసేవారు. ఈ ఇరువురూ కష్టించి సృష్టించిన ఆదాయం కనీస అవసరాలకు పోను మిగిలినది పన్నులు, బలులు రూపంలో పాలకులకి జేరుతుంది.

క్రీ.పూ. 6వ శతాబ్దం, భారత ఉపఖండంలో ఇనుము పనిముట్లు వ్యవసాయంలోకి ప్రవేశించాయి. ఇనుప కర్రు నాగలి, గొడ్డలితో అడవుల్ని నరికి, దున్ని సాగు భూములుగా మార్చారు. ఇనుము గనులున్న మధ్య గంగా మైదానం ఇందుకు వేదిక అయింది. వ్యవసాయం, చేతి పరిశ్రమలు, వ్యాపారం అభివృద్ధి చెందాయి. పట్టణీకరణ జరిగింది.

వ్యవసాయం, వ్యాపారంలో ఇదివరకెన్నడూ లేనంత అదనపు ఉత్పత్తి సృష్టించబడింది. ఈ అదనపు ఉత్పత్తిని బ్రాహ్మణ, క్షత్రియులకు జేరవేయటానికి ఒక యంత్రాంగం కావాలి. ఈ ఉత్పత్తిని సృష్టించే వైశ్య, శూద్రుల నుండి ఎప్పటికైనా ప్రమాదం పొంచి వుంటుంది. వారిని అణచివుంచాలి. ఇందుకు రాజ్య వ్యవస్థ 'జనపదం' పుట్టింది. ఇది చాలదు ఈ నూతన వ్యవస్థకి ప్రజల ఆమోదం కావాలి. అందుకో నూతన భావజాలం కావాలి. అదే బౌద్ధమతం.

బుద్ధుడు పుట్టాడు గనుక బౌద్ధమతం పుట్టిందనే అవగాహన తప్పు. ఏ భావజాలము, ఏ మతము తనంతటతాను పుట్టదు. ఏ మహావ్యక్తి వలన పుట్టదు. దాని వెనుక సామాజిక, ఆర్థిక కారణాలుంటాయి. కొన్ని వర్గాల ప్రయోజనాలుంటాయి. అంతకు ముందున్న భావజాలంతో సంబంధం కలిగి వుంటుంది. ఈ భావనతోనే బౌద్ధమతాన్ని అర్థం చేసుకోవాలి.

ఇనుము యుగంలో వ్యవసాయం ప్రధాన ఉత్పత్తిశక్తి. వ్యవసాయం వల్లనే వ్యవసాయేతర వృత్తులు, వ్యాపారం వర్ధిల్లుతున్నాయి. ప్రభుత్వ ఖజానా నిండుతోంది. వైదిక బ్రాహ్మణులు, యజ్ఞయాగాదులు, జంతు బలులు వ్యవసాయాభివృద్ధికి అడ్డంకి. వీటిని ఆపాలి. ఇప్పుడో మహత్తర ఆయుధం దొరికింది. అదే బుద్ధుడి అహింసా సిద్ధాంతం క్షత్రియులు, వర్తకులు ఈ మతాన్ని స్వాగతించారు.

చిన్న చిన్న రాజ్యాలు, తెగలు, సరిహద్దులు, విభిన్న ఆచార, సంప్రదాయాలు వ్యాపారాభివృద్ధికి సంకెళ్ళు. ఒకే రాజ్యం, ఒకే మతం, ఒకే భావజాలం, ఒకే ఆచార సంప్రదాయాలు కావాలి. పెద్ద బలమైన జనపదాలు, చిన్న బలహీనమైన జనపదాలను కబళించివేశాయి. చివరకు మగధ, మౌర్య సామ్రాజ్యాలు ఏర్పడినాయి. ఇవి బౌద్ధ మతానికి అండగా వున్నాయి. పాలకుల ఆదరణ లేకుండా ఏ మతమూ మనజాలదు. ఈ రాజ్యాలు తమ ప్రయోజనాలకనుగుణంగా బౌద్ధ మతాన్ని ఆదరించాయి. వ్యాపారులు భూరివిరాళాలతో బౌద్ధ మత ప్రచారానికి తోడ్పడ్డారు.

పాలకులైన బ్రాహ్మణ, క్షత్రియుల మధ్య అంతరంగిక ఘర్షణ వుంది. పాలన, యుద్ధాలు, క్షత్రియులవి. పెత్తనం బ్రాహ్మణులది, పైగా పన్నులు లేవు. ప్రత్యేక సౌకర్యాలు ఇవ్వాలి. బ్రాహ్మణుల వైదిక సంప్రదాయాలపై క్షత్రియులకు అసంతృప్తి వుంది. స్వయంగా క్షత్రియుడైన బుద్ధుడి వైపు రాచరిక వర్గాలు మొగ్గుచూపాయి.

బుదుడి కాలం నాటికే ఉపనిషత్తులున్నాయి. చార్వాకం వుంది. ఆత్మ, పరమాత్మల సంబంధాన్ని ఉపనిషత్తులు చర్చించాయి. ఆత్మ నిత్యం, శరీరం అనిత్యం. నీ పుట్టుక గత జన్మల కర్మ ఫలం. ఈ జన్మలో నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించు. జన్మరాహిత్యం పొందుతావు. అదే మోక్షం. ఎక్కడినుండి వచ్చావో అక్కడికే చేరుతావు. ఈ ఉపనిషత్తుల సారానికి 'చార్వాకం' వ్యతిరేకం. లోకాతీతశక్తులు లేవు. గాలి, నీరు, నిప్పు, మట్టి అన్నిటికి మూలం. స్వర్గ, నరకాలు లేవు. పూర్వ జన్మ, మరో జన్మలు లేవు. ఒక్కటే ప్రపంచం. ఒక్కటే జీవితం. వైదికంపై చార్వాకులు పోరాడారు. ఉద్యమంగా నిలిచారు. వారిది శూద్రుల బానిసల గొంతుక. ఆ గొంతుకను బ్రాహ్మణులు, క్షత్రియులు నులిమేశారు.

వైదికుల, చార్వాకుల పోరాటంలో బౌద్ధులు ఎటు ? ఈ ప్రశ్నకి జవాబే బౌద్ధుల పునాదుల్ని తడుతుంది. వారు ఏ వర్గానికి ప్రాతినిధ్యం వహించారో చెబుతుంది.

దుఃఖం అంటే ఏమిటి? దుఃఖానికి కారణం ఏమిటి? దుఃఖ రాహిత్యం ఎలా సాధ్యం ? అందుకు మార్గం ఏమిటి? జీవితమే దుఃఖం. ప్రపంచం దుఃఖమయం. కోరికలే దుఃఖానికి మూలం. కోరికలను జయించటమే నిర్వాణం. నిర్వాణ మంటే జనన మరణ రహితం. అది సాధించాలంటే మంచి మాట, మంచి పని అంటూ అష్టాంగ మార్గాన్ని ప్రతిపాదించాడు. ఇతరుల ఆస్తిని ఆశించకు, హింస చేయకు, దొంగతనం వద్దు – అంటూ నీతి నియమావళిని ప్రకటించాడు.

ఏదీ స్థిరం కాదు. పుట్టుక–చావు, మొదలు–చివర, ఐక్యత–ఎడబాటు అంటూ విశ్వంలో విరుద్ధ అంశాలున్నాయన్న బుద్ధుడు దుఃఖంతో పాటు సుఖం కూడా వుంటుందని చెప్పలేదు. శూద్రుల దుఃఖానికి కారణం వారి కష్టానికి తగ్గ ఫలితం దక్కకపోవటమేనని, బ్రాహ్మణుల, క్షత్రియులు సుఖానికి కారణం ఆ కష్టార్జితాన్ని దొంగిలించటమేనని అర్థం జేసుకోలేకపోయాడు. దుఃఖాన్ని సాధారణీకరణ చేశాడు.

దుఃఖానికి పరిష్కారంగా వ్యక్తిగత ప్రవర్తనను ముందుకు తెచ్చాడు. వ్యక్తిని సమాజం నుండి వేరుచేశాడు. నిర్వాణం అంటే కోరికలు లేకపోవడం అన్నాడు. కోరికలు అంటే ఏమిటి? శూద్రుడి కోరిక, వైదిక బ్రాహ్మణుడు, క్షత్రియుడి కోరిక ఒక్కటిగానే చూడాలా ? నిర్వాణమంటే అదో రకమైన మానసిక స్థితి అంటూ మనల్ని మనం మోసం చేసుకోకూడదు. కర్మ అంటే పని, ఆచరణ అంటూ ఆధునిక పదాలను ఆపాదించగూడదు. పునర్జన్మ, కర్మకి తొలి బౌద్ధ గ్రంథాలే సాక్ష్యం.

"నిజానికి మరో లోకం వుంది. (ఈ మానవ లోకం కానిది అంటే మరో పునర్జన్మ రాజ్యం) కనుక అది లేదనుకోవటం పొరబాటు అభిప్రాయం అవుతుంది. (Buddha Majjama Nikaya 1:402) కర్మ వుంది. అది జన్మ చక్రం ద్వారా దుఃఖాన్ని ప్రభావితం చేస్తుంది. కర్మల వల్ల కలిగే పునర్జన్మ పరంపరను అంతం చేసే మార్గం నిర్వాణమే.

పునర్జన్మల ప్రస్తావన బౌద్ధ గ్రంథాలలో వుంది. బుద్ధుని జాతక కథలలో రాయబడింది. వందల సంఖ్యలో ఈ జన్మలున్నాయి. తన పూర్వజన్మలు 91 పైనే తనకు గుర్తు వున్నాయని బుద్ధుడు చెబుతాడు. ఆ జన్మలలోని తన పేరు, కులం, వృత్తి అన్నీ వివరంగా తెలుసునన్నాడు. (మజ్జమనికాయ 1:483)

కార్యకారణ సంబంధాన్ని బుద్ధుడు చెప్పాడు. కాని కారణం నశించగానే కార్యం అంతమవుతుందని ముగించాడు. కాని అది మరో కార్యానికి కారణమవుతుందని, కార్యకారణ బంధం అనంతమని, అది ప్రకృతి ధర్మమని గ్రహించలేకపోయాడు. అందుకే నిర్వాణం అంతిమ పరిష్కారంగా భావించాడు.

దుఃఖం ఎక్కడోగాదు, ఇక్కడే వుందన్న బుద్ధుడు కారణం మాత్రం 'గత జన్మను' చూపాడు. గత జన్మల పాప ఫలితమే ఈ జన్మ అన్నాడు. మంచి అష్టాంగాలను ఆచరించి జన్మరాహిత్యం పొందవచ్చునన్నాడు. ఆత్మ, పరమాత్మలు గురించి చెప్పకపోయినా ఇది ఉపనిషత్తుల సారమే.

ఈ 'నిర్వాణం' బౌద్ధులలో గందరగోళానికి దారితీసింది. హీనయానం బుద్ధుడు మానవమాత్రుడని, నిర్వాణం పొందే వరకు మళ్ళీ, మళ్ళీ పుడతాడంది. మహాయానం బుద్ధుడు భగవంతుడి రూపమని, ఇతరులకు నిర్వాణం ప్రసాదించుటకు మాత్రమే పుడతాడంది.

బౌద్ధం దేశం నుండి తరిమివేయబడిందా? హిందూమతంలో లీనమయిందా? అనేది శేష ప్రశ్నగానే మిగిలిపోయింది. బౌద్ధం ఇలా అయిందని ఎవర్నీ నిందించాల్సిన పనిలేదు. లోపం బౌద్ధంలోనే వుంది. క్షత్రియుల, వర్తకుల ప్రయోజనాల మేరకే బౌద్ధమతం వైదికాన్ని వ్యతిరేకించింది. చార్వాకులను ప్రక్కన పెట్టి తన వర్గ ప్రయోజనాలను కాపాడుకుంది.

మార్క్సిజం

1769లో జేమ్స్ వాట్ ఆవిరియంత్రాన్ని కనిపెట్టాడు. 1764లో స్పిన్నింగ్ జెన్నీ, 1787లో పవర్‌లూమ్‌లు, 18వ శతాబ్దంలో ఇనుమును కరిగించే వినూత్న పద్ధతులు వచ్చాయి. పరిశ్రమలు, రవాణా, కమ్యూనికేషన్లు శరవేగంగా పురోగమించాయి. పెట్టుబడుల సమీకరణకు బ్యాంకింగ్ రంగం నెలకొంది.

ఇంగ్లాండ్ కేంద్రంగా యూరప్, అమెరికాలలో జరిగిన ఈ ఆవిష్కరణలతో పారిశ్రామిక విప్లవాలు వెల్లువెత్తాయి. ఫ్యూడల్ స్థానే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అమలులోకి వచ్చింది.

భూముల్ని కార్పోరేట్ కంపెనీలు చేజిక్కించుకున్నాయి. వ్యాపార పంటలతో మార్కెట్లు నిండాయి. వ్యవసాయంలోకి మెషీన్స్ దిగాయి. వేలాది రైతుకూలీలు భూమికి దూరం చేయబడినారు. పట్టణాలకు వలసపోయారు.

పెట్టుబడిదారులు, కార్మికులు అనే రెండు కొత్త వర్గాలు పుట్టాయి. ఆర్థిక వనరులు, ఫ్యాక్టరీలు పెట్టుబడిదారుల యాజమన్యంలో వుంటాయి. ఉత్పత్తి పంపిణీపై వారిదే అజమాయిషీ, కార్మికులు శ్రమశక్తిని నమ్ముకుంటారు. ఉత్పత్తి, పంపిణీ పై వారికెలాంటి కంట్రోలు లేదు.

పెట్టుబడికి లాభం, శ్రమకి జీతం పైకి న్యాయంగా, సహజంగా కనిపించే ఈ ఉత్పత్తి విధానం చాలా గొప్పదని సాంప్రదాయక ఆర్థిక వేత్తలు కీర్తిస్తున్న వేళ కారల్ మార్క్స్ ప్రవేశించాడు. ఫ్రెడరిక్ ఎంగెల్స్ జతకలిశాడు. పెట్టుబడిదారీ వ్యవస్థను శల్య పరీక్ష చేశారు. 'కేపిటల్' గ్రంథాన్ని కార్మిక వర్గానికి అందించారు.

పెట్టుబడికి లాభం సప్లయి, డిమాండ్లను బట్టి వస్తుందనే వాదనను మార్క్స్ తీవ్రంగా వ్యతిరేకించాడు. అర్థశాస్త్రంలో దాచబడిన ఒక మహత్తర సత్యాన్ని మార్క్స్ తొలిసారి విప్పి చెప్పాడు. శ్రమే అన్నిటికి మూలం. పెట్టుబడిదారీ సమాజంలో అది సరుకుగా అమ్మబడుతుంది. అంటే దానికో విలువ వుంది. అది కాలంతో కొలవబడుతుంది.

ఉదాహరణకి ఒక కార్మికుడు 8 గంటల పనిచేస్తే అందులో మొదటి భాగం అతని జీతం, ఫ్యాక్టరీ తరుగుదల, ఇతర ఖర్చులకు పోతుంది. మిగిలింది యజమాని కోసమే. అంటే ఫ్యాక్టరీ లోపలే అదనపు శ్రమ వలన వస్తువుకి, అదనపు విలువ ఏర్పడుతుంది. ఈ అదనపు విలువనే మార్కెట్లో అమ్మకానికి పెట్టి 'లాభం' అనే పేరు పెడతారు. సప్లయి, డిమాండ్ల వలన వచ్చే హెచ్చుతగ్గులు ఈ అదనపు విలువకి అటు, ఇటుగా వూగిసలాడుతుంటాయి.

సాంకేతికత నిరంతరం అభివృద్ధి పథంలో ముందుకు సాగిపోతూ వుంటుంది. సాంకేతికత పెరిగిన కొలదీ అదనపు విలువ, లాభాలు పెరుగుతూ వుంటాయి. అందుకే సాంకేతికతను పెంచుకోవటం కోసం పెట్టుబడిదారులు పోటీపడుతుంటాయి. ఈ పోటీలో పెద్ద చేపలు చిన్న చేపల్ని మింగినట్లు పెద్ద పెట్టుబడిదారులు చిన్న పెట్టుబడిదారులను నాశనం చేస్తారు. సంపద రాను రాను కొన్ని కుటుంబాలకే చేరుతూ, అనేకమంది దిగువస్థాయికి నెట్టబడతారు. మధ్యతరగతి చితికిపోతుంది. ఈనాడు మనం ఈ పరిస్థితిని స్పష్టంగా చూస్తున్నాం. డిజిటల్ రంగాన్ని దేశీయంగా, అంతర్జాతీయంగా రెండు, మూడు కంపెనీలు ఎలా శాసిస్తున్నాయో ప్రతి ఒక్కరికీ తెలుసు. 99 శాతం సంపాదించిన ఆదాయం ఒక శాతం కుటుంబాల చేతుల్లోకి పోతున్నాయి.

ఎప్పుడు సంపద ఒక చోట పోగుపడుతుందో, అపుడు అమీరులకి, గరీబులకి మధ్య తీవ్ర వర్గపోరాటం రాజుకుంటుంది. ఇది వర్గ సమాజంలో జరిగే సహజ పరిణామం. బానిస సమాజంలో బానిసలకు, బానిస యజమానులకు మధ్య, ఫ్యూడల్ సమాజంలో భూస్వాములకు, రైతులకు మధ్య, పెట్టుబడిదారీ సమాజంలో పెట్టుబడిదారులకు, కార్మికులకు మధ్య రాజీలేని వర్గ పోరాటాలు జరుగుతాయి. మార్క్స్ తన కమ్యూనిస్టు మానిఫెస్టోలో 'గత చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే'నన్నాడు.

వర్గాలున్నంతకాలం వర్గ పోరాటం వుంటుంది. రాపిడి వున్న చోట జ్వాల పుడుతుంది. పరస్పర విరుద్ధ శక్తుల మధ్య ఘర్షణ ప్రకృతి సహజం. ఘర్షణ మార్పుకి మూలమవుతుంది. మంచి-చెడుల మధ్య సంఘర్షణ వున్నప్పుడే చెడుపై మంచి గెలుస్తుంది. ఇది నిరంతర పరిణామం. గింజ మొలకెత్తి, వృక్షమై, పూలు పూసి, కాయలు కాసి అంతమైపోదు. మరిన్ని చెట్లకు, మరిన్ని సరికొత్త గింజలకు కారణమవుతుంది. ఒక సామాజిక వ్యవస్థలోని వర్గసంఘర్షణ ఆ వ్యవస్థను నాశనం చేస్తుంది. మరో ఉన్నతమైన నూతన వ్యవస్థకి స్వాగతం పలుకుతుంది.

మార్పుకు మూలం వ్యక్తులు కాదు. మహర్షులు, మహనీయులు కాదు. ఏ భావజాలం లేదా సిద్ధాంతం బుర్రలలో తనంతతాను పుట్టదు. ప్రకృతిలో దాగిన సత్యాన్ని సూత్రంగా వెలికితీసి ఆవిష్కరణలు చేస్తాడు శాస్త్రజ్ఞుడు. పెట్టుబడిదారీ సమాజాన్ని పరిశీలించి మార్క్స్ అదే చేశాడు.

అదనపు విలువ, ఆర్థిక సంక్షోభాలు, వర్గాలు, వర్గపోరాటం మార్క్స్ సృష్టించినవి కావు. సమాజంలో సహజంగా వున్నవి. వాటికి పరిష్కారం కూడా సమాజంలోనే వుంటుంది.

బౌద్ధం మత విశ్వాసంగా మారింది. భౌతిక ప్రపంచానికి దూరమైంది. దుఃఖానికి మూలమైన వర్గ దోపిడీని చూడ నిరాకరించింది. ఉపనిషత్తుల బాట పట్టింది. చివరికి నాగార్జునుడి శూన్యవాదం పాలైంది. శంకరుడి అద్వైతంగా తేలింది.

మార్క్సిజం ఒక సైన్సు. ప్రకృతి, సమాజం, ఆలోచనల చలనం లేదా మార్పును తెలియజేసే సైన్సు. సైన్సును అన్వయించటంలో తప్పులు జరుగుతుంటాయి. ఆ తప్పులే భవిష్యత్తుకు సోపానాలవుతాయి. సైన్సు నిరంతరం పురోగమిస్తూ కొత్త సత్యాలను ఆవిష్కరిస్తుంది.

మార్క్సిజం ఆచరణకి ఒక గైడ్ లాంటిది. పదాలు వల్లించడం కాదు. వాటి అర్థాల్ని గ్రహించి నిగ్గుతేల్చాలి. యాంత్రికంగా గాక సృజనాత్మకంగా అడుగు ముందుకువేయాలి. మన మార్గాన్ని మనం ఎంచుకోవాలి.

- డా॥ ఆర్.కె.

నాస్తిక హేతువాద సంఘాల ఐక్యవేదిక ఏర్పాటు

విజయవాడలోని గోరా యేథీస్ట్ సెంటర్‌లో మే నెల 30వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎనిమిది నాస్తిక హేతువాద సంఘాలు, నాస్తిక హేతువాద భావజాలంతో పని చేస్తున్న వ్యక్తులు అందరూ కలసి గోరా యేథీస్ట్ సెంటర్ నిర్వాహకులు ప్రముఖ వైద్యులు సమరంగారి అధ్యక్షతన సమావేశమై ప్రస్తుతం సమాజంలో సనాతన మతోన్మాద శక్తుల నుండి ఎదురవుతున్న విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి ఐక్యవేదికగా ఏర్పడాలని నిర్ణయించడమైనది. సంస్థ పేరు "నాస్తిక హేతువాద సంఘాల ఐక్యవేదిక" గా నిర్ణయించారు. ఈ వేదిక ఉమ్మడి లక్ష్యాలైన మూఢనమ్మకాల నిర్మూలన చట్టం సాధించుట, నాస్తిక హేతువాద, సైన్సువాద, భౌతికవాదులపై దాడి జరిగినప్పుడు ఎదురించుట దానికి తగిన కార్యాచరణ రూపొందించి కార్యాచరణ చేపట్టుట, నాస్తిక హేతువాద భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయుట, సమాజంలో ముఖ్యంగా యువతలో సైంటిఫిక్ టెంపర్ పెంచుట మొదలగు లక్ష్యాలపై కేంద్రీకరించి పనిచేయాలని నిర్ణయించడమైనది. ఈ సందర్భంగా వేదికకు ఒక కమిటినీ ఎన్నుకోవడం జరిగింది. వేదిక గౌరవ అధ్యక్షులుగా విజయవాడ గోరా నాస్తిక కేంద్రం నిర్వాహకులు జి.నియంత గారు, కన్వీనర్‌గా జె.వి.కృష్ణయ్య, కో-కన్వీనర్స్‌గా కె.కోటేశ్వరరావు, బి.నాగభూషణం, యూనివర్స్, చార్వాక, కె. రామలక్ష్మయ్య, నాగరాజు, బాబూరావు, సత్యనారాయణ, రాచపూడి ఆదినారాయణ, అరుణాచలం మొదలగువారిని ఎన్నుకోవడం జరిగింది. తర్వాత ఉద్యమంలో భాగంగా కలసివచ్చే నాస్తిక హేతువాద సంఘాలను, వ్యక్తులను కలుపుకొని వెళ్లాలని నిర్ణయించడమైనది.

ప్రాణుల పరిణామం

– డా॥ కొడవటిగంటి రోహిణీప్రసాద్

ప్రస్తుత యుగంలో బుద్ధిజీవులుగా జీవిస్తున్న మనకు రకరకాల జీవరాశితో నిండిన ప్రకృతి అద్భుతంగా అనిపిస్తుంది. అయితే మనుషులే లేనటువంటి యుగం ఒకటి ఉండేదనీ, ఇంకా వెనక్కెళితే ఎటువంటి ప్రాణీ లేని పరిస్థితి కూడా ఉండేదనీ గుర్తుంచుకోవాలి. భూగ్రహం 'మనకోసం' ఏర్పడిందనేది అర్థంలేని భావన. కొన్ని యాదృచ్ఛిక సంఘటనల ఫలితంగా తలెత్తిన జీవపరిమాణంలో మనుషుల ఆవిర్భావం ఇటీవల జరిగిన ఒక పరిణామం మాత్రమే. ఇది అనంతంగా కొనసాగుతుందన్న నమ్మకం కూడా ఏమీ లేదు. భూమిమీది జీవరాశికి ఆరంభం అనేది ఒకటుంది. ఎటొచ్చీ డార్విన్ పరిణామవాదం తెలిసినవారికి కూడా 'మొట్టమొదటి' ప్రాణి ఎవరో తయారుచెయ్యకుండా ఎలా తయారయి ఉంటుందో కదా అని అనుమానం కలుగుతుంది.

ఇందులో మొదటి సందేహం 'జీవశక్తి'ని గురించినది. జీవపదార్థం అంటే ఏమిటో మనకు తెలిసినట్టే ఉంటుంది కాని దీనికి సరైన నిర్వచనం చెప్పడానికి అరిస్టాటిల్ కాలం నుంచీ ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఆధునిక కాలంలో దాని లక్షణాలను జాబితా వేశారు. ప్రాణి అనబడేది తన ఉనికిని కాపాడుకుని, దాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తుంది. అది పునరుత్పత్తి వల్ల పుట్టి మళ్ళీ తన సంతతిని పునరుత్పత్తి చేసుకుంటుంది. ప్రతి ప్రాణిలోనూ జీవకణాల్లో జన్యుసమాచారం D.N.A రూపంలో నిక్షిప్తమై ఉంటుంది. ప్రోటీన్లద్వారా దాని ప్రభావం శరీర లక్షణాలుగా ప్రకటితమౌతుంది. ప్రాణుల్లో మెటాబోలిజమ్ అనే జీవన వ్యాపారం కొనసాగించే ఏర్పాటు ఉంటుంది. అందులో వాతావరణం నుంచి పదార్థాలను స్వీకరించడం, తద్వారా పొందిన శక్తిని శరీరానికి అందించడం అనే ప్రక్రియలు జరుగుతాయి. బాహ్యప్రపంచం నుంచి ఎటువంటి ఒత్తిడి ఎదురైనా ప్రాణి తొణకకుండా తన శరీరపు అంతర్భాగాలని స్థిరంగా ఉంచుకునే ప్రయత్నం చేస్తుంది. తనవంటి ఇతర ప్రాణుల మనుగడకు దోహదపడుతూ వాటన్నిటికీ గుర్తింపు కలిగేలా చూస్తుంది. దాని జన్యు పదార్థంలో సహజంగా జరిగే మార్పు (మ్యుటేషన్)ల ద్వారా ప్రకృతిలోని పరిస్థితులకు అనుగుణంగా మనుగడ కొనసాగిస్తుంది. జన్యువుల మార్పులూ, బైటి ప్రేరణలూ ప్రాణి చావును నిర్ణయిస్తాయి.

జీవాలు అతి ప్రాచీనమైనవి. భూమిమీద సుమారు 380 కోట్ల సంవత్సరాల కిందట జరిగిన జీవపదార్థపు ఆవిర్భావం గురించి ఈనాటికీ అనేక సిద్ధాంతాల ప్రతిపాదన జరుగుతోంది. జీవపదార్థమంటే సేంద్రియ పదార్థాల సముదాయమే. తలవని తలంపుగా ఒక పద్ధతిలో అవి కలిసినప్పుడు పునరుత్పత్తి సాధించిన కణాలు రూపొంది ఉంటాయి. ఇదెలా జరిగింది? ఆదిమ సముద్రాల నీటిపైన తేలిన బుడగల్లో కార్బన్తో కూడిన అణువులూ, అగ్నిపర్వతాలు వెదజల్లిన బంకమట్టి, లోహాల కణాలూ వచ్చి చేరాయని ఊహిస్తున్నారు. ఈ బుడగలు పేలినప్పుడు చిన్న చిన్న నీటిచుక్కలు చెల్లాచెదురై ఇగిరిపోయాయనీ, వీటితోబాటు సేంద్రియ పదార్థం చిన్న మోతాదుల్లో వెదజల్లబడి ఉంటుందనీ ఊహిస్తున్నారు. నీటి మీద నూనె బిందువుల వంటి లిపిడ్ పదార్థాలు కలిసి ఒక పొరలాగా ఏర్పడి సేంద్రియ కణాలను పోగుచేసి ఉంటుంది. ఈ చిన్న సంచుల్లో

ఇతర సేంద్రియ పదార్థాలు ఒక చోట చేరి ఉంటాయి. వాటి మీద సూర్యరశ్మి, పిడుగుల విద్యుత్తూ పనిచెయ్యడంతో అమినో ఆసిడ్లూ, డిఎన్ఏ, ఆర్ఎన్ఎల ముక్కలూ తయారయే పరిస్థితులు కలిగాయి. వర్షపునీరూ, హిమపాతమూ కూడా ఇందుకు తోడ్పడ్డాయి. యాదృచ్ఛికంగా రసాయనాల కలయికతో ఎన్నిరకాల సేంద్రియకణాలు ఏర్పడినప్పటికీ తమను తాము పునరుత్పత్తి చేసుకోగలిగిన తొలి జీవకణాలు త్వరలోనే తక్కినవాటిని పోటీలో ఓడించి ఉంటాయి. నీటి పరిణామం వల్ల తొలి ప్రోకేరియోట్ కణాలు రూపొంది ఉంటాయి. ఈనాటి బాక్టీరియా కొన్ని ఈ జాతివే.

మహాయుగం	దశ	శకం	లక్షల సం॥
సీనోజోయిక్	నియోజీన్	హూలొసీన్	0.1-0
		ప్లయిస్టోసీన్	18-0.1
		ప్లయొసీన్	53-18
		మయొసీన్	230-53
	పేలియోజీన్	ఓలిగోసీన్	340-230
		ఈయొసీన్	560-340
		పేలియొసీన్	660-560

సుమారు లక్షన్నర ఏళ్ళ క్రితం అతిగొప్ప నాడీవ్యవస్థతోనూ, అద్భుతమైన మెదడుతోనూ ఆధునిక మానవులు ఆవిర్భవించక ముందు భూమిమీద చాలా పెద్ద జీవపరిణామమే జరిగింది. అందుకు రంగం సిద్ధం కావడానికి వందల కోట్ల ఏళ్ళు పట్టింది. మనిషికి ముందు దశలవారీగా జీవపరిణామం సాగి, ఒకదాని వెంట ఒకటిగా, ఒక్కొక్కప్పుడు ఒకదానివల్ల మరొకటిగా కూడా రకరకాల జంతువులు పుట్టాయి. జీవరాశి వల్లనూ, ఇతరత్రా కూడా భూగోళంలోనూ, స్థానికంగా వివిధ స్థలాల్లోనూ భౌతిక మార్పులు జరిగాయి. ఇవి జీవపరిణామంపై తీవ్రప్రభావాలు కలిగించాయి. నీరూ, నేలా, వాతావరణమూ మారుతున్న కొద్దీ కొత్త జీవరాశి ఆవిర్భవించడం సాధ్యమైంది. అంచెలంచెలుగా జరిగిన ఈ మార్పుల క్రమం ఇది.

భూమి మీద అతి ప్రాచీనమైన తొలి జీవకణాలకు సాక్ష్యాలు స్ట్రోమాటొలైట్ జాతి శిలలలో దొరికాయి. ఈ రాళ్ళు కార్బొనేట్, లేదా సిలికేట్ పదార్థాలతో పొరలుగా సుమారు 350 కోట్ల సంవత్సరాల కిందట ఏర్పడ్డాయి. సూక్ష్మరూపంలో ఉన్న సయనో బాక్టీరియా వంటి జీవకణాలు నీటి బురదలో దిగబడి, బందీలలాగా ఇరుక్కుపోయాయి. ఇవి సూర్యకాంతిని కిరణ సంయోగానికి వాడుకున్నాయి. సముద్రతీరాల వెంబడి మైళ్ళకొద్దీ రాళ్ళమీద దిబ్బలలాగా పెరిగిన ఈ సూక్ష్మకణాలు సముద్రపు ఆటుపోటులతో నీటికి తడుస్తూ, ఎండను పీల్చుకుంటూ లక్షల ఏళ్ళపాటు అభివృద్ధి చెందాయి. (నీరూ, సూర్యకాంతి, గాలిలో ఆక్సిజన్ ఉన్న చోట్ల ఇటువంటి జీవకణాలే పెరుగుతాయని శాస్త్రవేత్తల నమ్మకం. అందుకనే కుజగ్రహం మీద ఈనాటి పరిశోధనలన్నీ ఇలాంటి సంఘటనల దాఖలాల కోసమే జరుగుతున్నాయి).

తొలి జీవకణాలు పుట్టినప్పటి నించీ 100 కోట్ల సంవత్సరాల క్రితం వరకూ జరిగిన జీవ పరిణామంలో భౌగోళిక మార్పుల పాత్ర చాలా ఉంది. (వంద కోట్ల సంవత్సరాలంటే ఎంతటి సుదీర్ఘమైన కాలమో ఆలోచించినా వెంటనే అర్థం కాదు. జీవపరిణామానికి కీలకాంశం కాలమే.)

అగ్నిపర్వత ప్రాంతాలూ, వాటి పక్కనే తొలినాటి భూఖండాలూ నెమ్మదిగా చేరువౌతూ, వేరుపడుతూ జీవపరిణామాన్ని ప్రభావితం చేశాయి. ఈ మార్పులకు తట్టుకుంటూ కొత్త లక్షణాలు సంతరించుకున్న జీవకణాలు కొన్నాళ్ళకు నీటిలోని ఆక్సిజన్ను సంగ్రహించడం "నేర్చాయి". తీరప్రాంతాల్లో లోతులేని నీళ్ళలో రాళ్ళమీద తీగలలాగా, చిన్న చిన్న గోలీలలాగా రకరకాల ఆకారాల్లో ఇవి విపరీతంగా పెరిగాయి. ప్రకృతి వైపరీత్యాలవల్ల నాశనమవకుండా నిలిచిన ఈ పాచివంటి పదార్థమే తొలి జీవరాశి. మనమంతా దానికే వారసులం. కనబడనంత నెమ్మదిగా, ఎంతో కాలంపాటు సాగిన జీవరాశి చరిత్ర వివరాలు స్థూలంగానైనా మనం తెలుసుకోవాలి. ఇందులో ఎన్నెన్నో మహాయుగాలూ, యుగాలూ, దశలూ, శకాలూ గడిచాయి.

100, 200 కోట్ల సంవత్సరాల కిందట యూకేరియోట్ జాతి కణాలు ఉత్పత్తి అయాయి. "ఉన్నత" ప్రాణుల పుట్టుకకు ఇది తొలిమెట్టు అనుకోవచ్చు. ఈ కణాల న్యూక్లియస్ (కేంద్రం) చుట్టూతా ఒక మెమ్‌బ్రేన్ పొర ఉంటుంది. అందులో సంతానోత్పత్తి కలిగించే కణవిభజనకు ఏర్పాటు సాధ్యమౌతుంది. అప్పటికి జీవకణాల అంతర్ నిర్మాణంలో ఇంత సంక్లిష్టత ఏర్పడలేదు. త్వరలోనే ఏకకణజీవులు కొన్ని బహుకణజీవులుగా రూపొందాయి. తుట్టెలాగా కదిలే ఈ కణసముదాయం క్రమంగా 'సహజీవనానికి" అలవాటుపడి ఉంటుంది. మన శరీరాల్లో కూడా విడివిడిగా కొంత స్వతంత్రంగా పనిచేసే రకరకాల వ్యవస్థలున్నాయి.
వాటి మధ్య సమన్వయానికి భంగం కలిగితే ప్రాణానికే అపాయం.

మహాయుగం	దశ	కోట్ల సం.
మెజోజోయిక్	క్రెటెషన్	14.6–6.6
	జురాసిక్	20.0–14.5
	ట్రైయాసిక్	25.1–20.0
పేలియోజోయిక్	పెర్మియన్	29.9–25.1
	కార్బోని ఫెరస్	35.9–29.9
	డీవోనియన్	41.6–35.9
	సిలూరియన్	44.4–41.6
	ఆర్థోవీషియన్	48.8–44.4
	కేంబ్రియన్	54.2–48.8

భూమి పుట్టుక లగాయతు కేంబ్రియన్ దాకా 460–54.2

సుమారు 50 కోట్ల సంవత్సరాల క్రితం సముద్రాల్లో ఒక్క పెట్టున బహుకణ నిర్మాణం కలిగిన జీవరాశి ఆవిర్భవించింది. ఆ కేంబ్రియన్ దశలో నేలమీద ప్రాణులుండేవి కావు. భూఖండాల రూపురేఖలు వేరుగా ఉండేవి. 46 కోట్ల సంవత్సరాల నాటి ఆర్థోవిషియన్ దశలో నేటి అట్లాంటిక్ మహాసముద్ర ప్రాంతానికి ఇరువైపులా ఉన్న ఖండాలు దగ్గరయాయి. ఆ కాలంలో వెన్నెముక గలిగిన అతి ప్రాచీనమైన దవడలేని చేపలు మొదటగా ఆవిర్భవించాయని తెలుస్తోంది. సముద్రాల్లో పగడపు మొక్కలవంటివి ప్రత్యక్షం అయాయి. రమారమి 43 కోట్ల సంవత్సరాలనాటి సిలూరియన్ దశలో నేలమీద మొదటి మొక్కలూ, తేళ్ళవంటి ప్రాణులూ, నీటిలో కొన్ని రకాల చేపలూ దర్శనమిచ్చాయి.

దాదాపు 39 కోట్ల సంవత్సరాల క్రితం డీవోనియన్ దశలో ఎన్నో రకాల సముద్రపు చేపలు పుట్టుకొచ్చాయి. మరికొన్ని మంచినీటిలో పెరిగాయి. నేలమీద పెద్దపెద్ద ఫెర్న్ మొక్కలు పెరగసాగాయి. సొరచేపలు రూపొందాయి. సుమారు 33 కోట్ల సంవత్సరాలనాటి కార్బోనిఫెరస్ దశలో ఊబినేలలూ, వేడిమీ, తేమా కలిగిన వాతావరణమూ ఏర్పడ్డాయి. అక్కడ ఏపుగా పెరిగిన అడవులు తరవాతి కాలంలో బొగ్గు నిలవలుగా మారాయి. ఉభయచరాల సంఖ్య పెరిగి బల్లులూ, పూర్తిగా పొడినేలమీదనే బతకగలిగే వెన్నెముకగల ప్రాణులూ ఆవిర్భవించాయి. తూనీగలవంటి ఎగిరే పురుగులు మొదటిసారిగా పుట్టుకొచ్చాయి. రమారమి 27 కోట్ల సంవత్సరాల క్రితం పెర్మియన్ దశలో భూఖండాలన్నీ ఒకటై పేంజియాగా రూపొందాయి. ఉత్తరార్థగోళంలో పైనవంటి వృక్షాలు మొదటగా పుట్టాయి. నేలా, సముద్రాలూ పెద్దపెట్టున రూపాంతరం చెందడంతో జీవరాశి చెప్పుకోదగిన స్థాయిలో అంతరించడం తొలిసారిగా జరిగింది. అతి ప్రాచీనమైన పేలియోజోయిక్ మహాయుగం ముగిసింది.

కాలం గడుస్తూనే ఉంది. జీవపరిణామం కొనసాగిస్తూనే ఉంది. దాదాపు 22.5 కోట్ల సంవత్సరాలనాటి మెసోజోయిక్ మహాయుగంలో ట్రైయాసిక్ దశ మొదటిది. ఇందులో పేంజియా రెండుగా చీలి, ఉత్తరాన లారేషియా, దక్షిణాన మళ్ళీ గోండ్వానా లాండ్ అనే భూభాగాలు ఏర్పడ్డాయి. ఇది రాక్షసి బల్లుల కాలం. తొలిగా తాబేళ్ళూ, క్షీరదాలూ పుట్టుకొచ్చాయి. ఏ 17 కోట్ల సంవత్సరాల క్రితమో మొదలైన జురాసిక్ దశలో ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం వెడల్పు అయింది. దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రం ఏర్పడింది. నేలమీద రాక్షసిబల్లులదే రాజ్యం. ఆదిమజాతి పక్షులు పుట్టుకొచ్చాయి. పీతలూ, రొయ్యల వంటి ప్రాణులు పెరగసాగాయి, సుమారు 10 కోట్ల సంవత్సరాల క్రితం క్రెటేషన్ దశలో ఉత్తర అమెరికాలో రాకీ పర్వతాలు లేచాయి. ఇది అంతమయే నాటికి రాక్షసిబల్లులూ, అనేక ఇతర ప్రాణులూ అకస్మాత్తుగా అంతరించిపోయాయి. పూలమొక్కల ఆవిర్భావం జరిగింది.

6.5 కోట్ల సంవత్సరాల క్రితంనుంచి 25 లక్షల సంవత్సరాల క్రితపు మధ్యకాలంలో ఉత్తర అమెరికా ఖండానికీ, యూరప్ కూ ఉండిన లంకె తెగిపోయింది. ఉత్తర, దక్షిణ అమెరికాలకు సంబంధం ఏర్పడింది. ఈ సీనోజోయిక్ మహాయుగంలో నేలమీదా, సముద్రాల్లోనూ నేడు మనకు తెలిసిన ప్రాణికోటి ఆవిర్భావం జరిగింది. ఇది క్షీరదాల యుగం. గత 25 లక్షల సంవత్సరాల పరిణామాలను గమనిస్తే అనేక హిమయుగాలు వచ్చిపోయిన రుజువులు కనిపిస్తాయి. మధ్య దక్షిణ ఆఫ్రికా, చైనా, జావా మొదలైన ప్రాంతాల్లో మనిషి పుట్టుకకు దారితీసిన జీవాలు ఆవిర్భవించాయి. ఈ సంఘటనల్లో మనిషి పుట్టడం అనేది కాకతాళీయంగా, అనేక యాదృచ్ఛిక విషయాల ఫలితంగా జరిగిందనడంలో సందేహం లేదు.

జీవపరిణామం ఆగిపోలేదు. నీటిలో పుట్టిన జీవరాశి క్రమంగా రకరకాల పీతలూ, చేపలుగా పెరుగుతూ పోయింది. ఇప్పటికీ పెరిగే వృక్షజాతుల్లో శాస్త్రవేత్తలు ప్రాచీనమైనవేవో, ఆధునికమైనవి ఏవో గుర్తిస్తూనే ఉన్నారు. ఇంతకాలంగా పెరుగుతూ వస్తున్న ప్రాణుల్లో సూక్ష్మమైన బాక్టీరియా నుంచి బ్రహ్మాండమైన తిమింగలందాకా అన్నిటిలోనూ ఒకే రకమైన జీవకణాలుంటాయి. జీవరాశి ఏకత్వానికి రుజువు ఇదే. జీవ ప్రక్రియలకు దారితీసిన పదార్థం రైబో న్యూక్లియర్ ఆసిడ్ అనబడే ఆర్ఎన్ఎ అయి ఉంటుందని కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ఆర్ఎన్ఎ జన్యువుల్లో ముఖ్యపాత్రను నిర్వహిస్తుంది. అనువైన వాతావరణంలో, ఉన్న రసాయనిక పదార్థాల నుంచి తనకు కాపీలను తయారు చేసుకోగలిగిన సామర్థ్యం దీనికి ఉంది. ఒక రకమైన ఆర్ఎన్ఎ ప్రోటీన్ల తయారీకి ఉపయోగపడుతుంది. 20 రకాల అమినోఆసిడ్ల నుంచే ప్రోటీన్లు తయారౌతాయి గనక ఆదిమ జీవరాశిలో ఆర్ఎన్ఎ ప్రముఖమైనదిగా ఉండి ఉండాలి. ఇటువంటి పరిణామాలు విశ్వంలో ఎక్కడైనా జరిగే అవకాశం ఉంది.

జీవపరిణామ సిద్ధాంతం అర్థం చేసుకోవాలంటే ఒక జాతి ప్రాణుల జనాభాను ఒక ప్రత్యేక సముదాయంగా గుర్తించాలి. వీటిలో ప్రతి ప్రాణికీ తమతమ ప్రత్యేక లక్షణాలుంటాయి. అందుకు కారణమైన జన్యువుల నిర్మాణం వాటి శరీరాల్లో ఉంటుంది. ప్రాణి జీవితకాలంలో దాని శరీర నిర్మాణంలో మార్పేమీ జరగదు. ఎటొచ్చీ ప్రాణుల జనాభా మొత్తంగా పరిణామం చెందుతున్నప్పుడు రకరకాల జన్యువులున్న ప్రాణుల నిష్పత్తిలో మార్పులు జరుగుతూ ఉంటాయి. ఉదాహరణకు ఇంతకు ముందు చెప్పినట్టుగా ఇంగ్లండ్ పారిశ్రామిక విప్లవకాలంలో ఆవిరి యంత్రాలు విపరీతంగా వాడడంవల్ల చెట్లన్నీ మసిబారిపోయాయి. నల్లబడ్డ చెట్ల బోదెలమీద వాలిన తెల్లని సీతాకోకచిలకలన్నీ పక్షుల కంటబడి వాటికి ఆహారం అయిపోయాయి. దాంతో అప్పటివరకూ 2 శాతం మాత్రమే ఉండిన నల్లని సీతాకోకచిలకలన్నీ చావకుండా మిగిలాయి. త్వరలోనే తెల్లనివన్నీ చచ్చిపోయి నల్లనివాటి జనాభా పెరిగింది. అంతమాత్రాన తెల్లనివి పుట్టడం పూర్తిగా ఆగిపోయిందని కాదు. బాహ్య పరిస్థితులనుబట్టి జీవపరిణామం ఇలాగే జరుగుతుంది. నిజం చెప్పాలంటే దీన్ని జీవపరిణామం అనకుండా నాచురల్ సెలెక్షన్, లేదా ప్రకృతి నిర్వహించే ఏరివేతగా గుర్తించాలి.

శారీరక మార్పులన్నీ జీవపరిణామానికి ప్రతీకలు కావాలని లేదు. ఉదా॥ మనిషి సగటు పరిణామం మునుపటికన్నా పెరిగింది. అందుకు కారణం ఈనాడు చాలామందికి పౌష్టిక ఆహారం లభించడమూ, దాని ప్రాముఖ్యతని ఆధునికులు గుర్తించడమూను. ఇది జీవపరిణామంవల్ల కలిగిన మార్పు కాదు. ఇలాంటి లక్షణాలన్నీ వంశానుగతంగా సంతతికి అందుతాయని చెప్పలేం. అలాగే జీవపరిణామం ప్రతిసారీ శారీరక మార్పులు కలిగించాలని కూడా లేదు. కొన్ని పరిస్థితుల్లో దానివల్ల ఒక రకం ప్రాణులు తక్కినవాటికన్నా ఎక్కువ సంఖ్యలో ఉత్పత్తి కావచ్చు. పరిణామం అంటే అభివృద్ధి అని కూడా కాదు. ఒక పరిస్థితిలో అనుకూలం అయిన శారీరక మార్పులే ఆ పరిస్థితులు మారిపోగానే ప్రతిబంధకాలు కావచ్చు. జంతువులు "మారిపోవు", పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు సర్దుబాట్లు జరుగుతూ వుంటాయి.

ప్రాణులు పరిసరాలవల్ల ప్రభావితం కావడంతో అయిపోదు. వాటివల్ల పరిసరాలు కూడా ప్రభావితం అవుతాయి. అవి తమ చుట్టూ ఉన్న పదార్థాల్లోంచి ఆహారం పీల్చుకుంటాయి. వ్యర్థాన్ని విసర్జిస్తాయి. ఉదాహరణకు మొక్కలు వదిలే ఆక్సిజన్ వాయువే జంతువులకు ప్రాణాధారం. జంతువులు విసర్జించినది మొక్కలకు ఎరువు అవుతుంది. తొలినాటి సముద్రచరాలు చచ్చి నీటి అడుగుకు చేరుకున్నాక వాటి పెంకుల్లోని కాల్షియం, కార్బోనేట్లూ, సముద్రజలాల లక్షణాలని మార్చాయి. ఇవన్నీ ప్రకృతిలో యాంత్రికంగా, నిరంతరం జరిగే భౌతిక ప్రక్రియలు. మనిషిజాతి కూడా వీటి ఫలితంగా పుట్టుకొచ్చినదే. **భూమిని "ఏలడానికీ" మనిషిని ఎవరూ "తయారు" చెయ్యలేదని మనం గుర్తించాలి.** •

"సంభవామి...."- చేగిరెడ్డి చంద్రశేఖరరెడ్డి

"**ని**జం" నిప్పులాంటిదన్నారు. అంటే కాలుతుంది అని... మనిషి జడత్వానికి చురక అంటించి చైతన్యాన్ని కలిగించే ఒక హెచ్చరిక లాంటిది నిజం! నిప్పు ఎలా ఉద్భవించింది; దాని గుణం వగైరాలు తెలిసివచ్చే పరిస్థితులకే.. ఈ సామెతను అన్వయించడం జరిగింది.

అలాగే నిజం కూడ తాత్కాలికంగా వినడానికి మతస్తులకు (మౌఢ్యులకు) నిప్పు చురకలాగ కాలినంత కష్టంగా వున్నా... నిదానించి ఆలోచిస్తే, అవగాహన చేసుకొంటే, చర్చిస్తే, తర్కిస్తే తెలియవచ్చేది విజ్ఞానంతో కూడిన విషయ పరిశీలనతో నిండిన సత్యరూపకమైన విషయమే! అదే నిజం!

భూ భారం తొలగించడానికి విష్ణువు 'పరశురాముడు'గా పొడవైన మిక్కిలి కఠినమైన గొడ్డలి గలిగి జన్మించాడు(ట). భూమికి జనభారం ఎక్కువయిందని, అది తగ్గించడానికి అలా జన్మించాడట. అంత భారం కలిగించేంత జనాన్ని దేవుడు ఎందుకు సృష్టించాడో? భారమయిందని చెపుతేగాని తెలిసిరాలేదేమో? తెలిసిన తర్వాత ఏదో ఒక ఉపాయంతో తగ్గించడానికి (తెలియక చేసినందుకు) ప్రయత్నించాలిగాని.. దానికోసం పనిగట్టుకొని ఒక అవతారంగా పుట్టడమెందుకో? అవతరించాడే పో... గండ్రగొడ్డలితో జన్మించడమేంటి? అది మారణాయుధంకదా! మారణాయుధాలు కలిగివుండే వారిని ఏమంటారు? దుర్మార్గులు! దుష్టులు! దైవరూప రాక్షసులు! మతమౌఢ్యులు అనరా?

'దేవుడేమిటి? మారణాయుధాలతో జన్మించడమేంటి? అని శత్రువులు; పగవారు గేలిచేస్తారనే ఆలోచన కూడా లేదేమో? అందరికి జన్మలనిచ్చి జన్మింపజేసేవాడు తాను కూడా జన్మించడమేంటి? అయినా దేవుడి అవతారానికి ఇన్ని ప్రశ్నలు కూడా పుట్టుకొస్తాయా? దేవుడంటేనే ప్రశ్నార్థకమేనేమో? ఇక అలా అవతరించిన దేవుడు తన తండ్రికి జరిగిన అవమానానికి ప్రతీకార జ్వాలగా... మరియు భూ భారాన్ని తగ్గించాలనే సాకుతో విజృభించి, గొడ్డలితో భూమి పై నున్న రాజులపై పగతో రగిలి దండెత్తిపోయి...

కం॥ ఖండించి రిపుల శిరములు
కొండలుగా ప్రోగులిడియె గురురక్తనదుల్
నిండుకొని పారి యుబ్బెను
భండనమున నృపులు రిపులు భయమందనృపా!

– భాగ – 9–484

"అలా రాజుల తలలు నరికి రక్తనదులు పారించి సర్వదేవమయుండగు దేవుడైన పరశు రాముడు అంతటితో ఆపుకోలేక కోపంతో మిగిలినవారిపై పగతో... భూమిపైనున్న రాజులను ఇరువదొక్కమార్లు తిరిగి తిరిగి తన పొడవైన; వజ్రంకంటె కఠినమైన గొడ్డలిచేత సర్వక్షత్రీయ వంశాలను ఖండించి పెక్కుమందిని చంపాడు" – భార–ఆది–1–78.

"పరశురాముడు తన వాడియైన గొడ్డలిచేత ఛేదింపబడిన సర్వక్షత్రియుల యొక్క పారిన రక్తంచేత పూర్తిగా నిండేటట్లుగా ఐదు హ్రదాలను (మడుగులను) ఏర్పరచాడు"– భార–ఆది–1–79

–"పరశురాముడు కోప పీడితుడై రాజులను చంపి ఆపై రాజపత్నుల గర్భాలలో నున్న శిశువులతో మొదలిడి నరుకుతూ రాజులందరినీ ఎవరినీ మిగులకుండ చంపాడు" – భార–ఆది–4–226

"పరశురాముడు ఉగ్రకోపియై ఇరువది ఒక్కమార్లు దండెత్తి క్షత్రియులనందరిని వధించగా విధవలైన ఆ రాజుల భార్యలు సంతానకాంక్షతో రుతుకాలాలలో బ్రాహ్మణ శ్రేష్ఠుల అనుగ్రహంతో సంతానాన్ని పొందారు. మళ్లీ రాజ వంశాలు వర్ధిల్లాయి" – భార–ఆది–3–51.

కం॥ "భగవంతుడు హరి ఈ క్రియ
భృగుకులంబున బుట్టి యెల్లపృథిలీ పతులన్
జగతీభారము వాయగ
బగగొని పలుమారు చంపె బవరమున నృపా" – భాగ–9–491.

తా॥ భగవంతుడైన హరి భృగుకులంలో పుట్టి ఎన్నో పర్యాయాలుగా దండెత్తి రాజులనందరిని చంపి భూభారం తగ్గించాడు.

భగవంతుడంటే ఎవరో – ఎందుకు జన్మిస్తాడో.? ఏమేమి పనులు ఎలా చేస్తాడో తెలియజేస్తున్నాయి మతగ్రంథాలలో..

భూభారం తగ్గించడానికి రాజులనందరిని; రాజుల భార్యల కడుపులో నున్న శిశువులతో మొదలిడి నరుకుతూ 21మార్లు భూమినంతా తిరిగి రాజులనందరిని చంపాడట:

ఇదా భగవంతుడు ధర్మాన్ని కాపాడడమంటే? ఇదా భగవంతుడు సాధుజనులను రక్షించడమంటె? ఇదా భగవంతుడి దుష్టశిక్షణ అంటే?

భూమికి భారమని కొందరిని; దుష్టులు, దుర్మార్గులని కొందరిని, నీచులు, రాక్షసులని కొందరిని చంపడానికే అవతరించడమా దేవుని పని? ఇదే నా ఆ దేవుని వృత్తి? (చంపే వృత్తికన్నా చావడమే మేలు)

గోహత్య పాపమని; స్త్రీ హత్య మహాపాపమనీ; భ్రూణహత్య (శిశుహత్య) పాపిష్ఠి పాపమని శాస్త్రాలు ఘోషిస్తూ వుండగా.... ఇలా జీవహింస చేయడం మహాపాపమని ఎరుగడా? మనుష్యుల్ని చంపడం జీవహింస కాదనుకున్నాడా? ఇంత ఘోరాతిఘోరమైన పాపం చేసినవాడు ఎంత కఠినాత్ముడో? ఎంత కర్కశుడో? ఎంతటి పాషాణ హృదయుడో? ఎంతటి కసాయివాడో? ఎలాంటి కటికవాడో తెలియరాకున్నది. ఇదీ 'సంభవామి' అంటూ పుట్టిన దేవుడు. దేవుడి అవతారాల మహిమాన్విత పుణ్యప్రదమైన కథల సమాహారం.

ఇలాగే కృష్ణావతారంలో... కూడా...

శ్లో॥ కురుపాండవ యుద్ధంచ కారయా మాస భేదతః॥
భువో భారావతరణం చకార యదునందనః॥

తా॥ కృష్ణుడు కురుపాండవులకు భేదం కలిగించి కురుక్షేత్రయుద్ధంలో ఒకరినొకరు చంపుకొనునట్లు చేసి భూ భారం తగ్గించాడు. – బ్రహ్మవైవర్తన పురాణం.

భూ భారమనే సాకుతో దేవుడు యింత దుర్మార్గమైన పనులు చేస్తూ... చేయిస్తూ వుంటాడని ఇలా అంతటా పేర్కొన్నారు. కాని కృష్ణుడే భూమికి భారం! ఎలాగంటే?...

కృష్ణుడి రాణులు 8 మంది అదనంగా కృష్ణుడు భార్యలుగా స్వీకరించినవారు 16000 మంది. వీరికి ఒక్కొక్కరికి 10మంది మగ సంతానం. అంటే భార్యలు 160008 మంది సంతానం. సంతానం 16008×10=1,60,080 మంది కొడుకులు. మొత్తం భార్యలు+కొడుకులు16008+ 1,60,080 =1,76,088 మంది. ఇంత మందిని కలిగిన కృష్ణుడు భూమికి భారం కాడా? ఏది భూభారం? ఎవరు- ఎవరిని చంపాలి? ప్రతీయుగంలో 'సంభవామి' అంటూ అవతరించి ఇలా దుర్మార్గమైన పనులు చేస్తూ తానే అందరికి భారమైనాడు. ఇలా చేయడమేనా దేవుడి నిర్వాకం? - భాగవతం.

'దేవుడు' అని ఒక్క అబద్ధమాడి, దానిని 'నిజం' అని ఒప్పిండానికి పుణ్యమని, పుణ్యతీర్థాలనీ, పుణ్యలోకమనీ, స్వర్గసుఖాలని, మోక్షమని, ఆత్మ, జీవాత్మ, పరమాత్మ, బ్రహ్మ, పరబ్రహ్మమంటు ప్రచారం చేయడానికి కోట్లకొలది అబద్ధాలు ఆడవలసి వచ్చింది.

అలాగే దేవుడిని అవతారాలెత్తించి అభూత కల్పనాకథలుగా వర్ణించి రచించే మార్మికాల వలలలో చిక్కుకొని, ఏమి వ్రాస్తున్నామో అనే ఇంగితజ్ఞానాన్ని పండితులు కోల్పోవడం వల్ల దేవుడిచేత యింత దుర్మార్గమైన పనులు చేయించవలసి వచ్చింది.

కవులు, పండితులు ఇలాంటి మతసాహిత్యాన్ని వెలువరించిన ఈ నేపథ్యంలో ప్రతి రాయి, రప్ప, గుట్ట, చెట్టు, పుట్ట ప్రతిదానిని దైవ రూపాలుగా చిత్రించి ప్రజలను భక్తి బానిసలుగా, భజనపరులుగా చేశారు.

విద్వాంసులు సైతం తమ ప్రతిభనంతా ఫణంగా పెట్టి వేలకొలది దైవగ్రంథాలు రచించారు. ప్రతి రాయిని దైవంగా వర్ణించి... ఎన్నో శ్లోకాలు, దండకాలు, పద్యాలు, గేయాలు, పాటలు, వచనాలు, ప్రవచనాలు రచించి తమ జీవితాలనే ఈ సేవకు ధారబోశారు.

సంగీత విద్వాంసులు -గాన కళాకోవిదులు, వాగ్గేయకారులు దైవపారాయణా పాటలకు 'బాణీలు' సమకూర్చి మధురంగా, శ్రావ్యంగా పాడుతూ ఆ గానలహరిలో తన్మయత్వంతో ఓలలాడిపోయారు... అయితే...

శ్లో॥ "నదేవో విద్యతే కాష్ఠే! నపాషాణే నమృణ్మయే।
భావేషు విద్యతే దేవః। తస్మాద్భావోహి కారణం।"

తా॥ దైవం కర్రలోను, రాతిలోను, మట్టిలోనూ లేదు! మనసులో కలిగిన భావమే దైవం. అందువలన మనసే కారణం! అని పండితులు ఉన్న సత్యాన్ని బయల్పరచారు. ఇలాగే...

"జగదాహురనీశ్వరమ్" - గీత- 16-8

ఈ జగత్తుకు ఈశ్వరుడు లేడు అని గీతలో సైతం పేర్కొన్నా కూడా...

మరియు విజ్ఞాన శాస్త్రాభివృద్ధితో పురోగాములై చంద్రమండలానికి యాత్రలు సాగించే ఈ కాలంలో కూడా ఇలా అజ్ఞాన దిశగా మత మాయావలయంలో చిక్కుకొని ఆటవిక జనాని కన్నా అమాయకంగా - తీర్థయాత్రలు, దీక్షలు, మాలలు ధరించి తిరునాళ్ళు సాగించే మతమార్మిక జనులను ఏమనుకోవాలి? ఏమిటీ సనాతన ధర్మాలు - కర్మలు. ఏమిటీ సంస్కృతీ - సంప్రదాయాలు.

మత మార్మికాలంతరింపజేసి మత పరిధిదాటి మనిషిగా తనను తాను తెలుసుకొని "సంభవామి" మనిషిగా...! సాగాలి మనీషిగా! •

కుట్ర రాజకీయం

- షేక్ కరిముల్లా

'నీవు రాజకీయాలను పట్టించుకోకపోయినా, రాజకీయాలు నీ జీవితాన్ని ప్రభావితం చేసి తీరుతాయి- 'లెనిన్

2023లో 106వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు ఆమోదించిన 'నారీ శక్తి విధాన్ అభయాన్' పేరుతో మహిళ రిజర్వేషన్ చట్టం ఆమోదం పొందింది. ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్ ముసుగు) తో ముడిపెట్టి, సవరణ అంటూ కొత్త అవతారం ఎత్తి, 131వ రాజ్యాంగ సవరణ బిల్లును మోడీ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్లో ప్రవేశ పెట్టగా, రెండు రోజులు సుదీర్ఘ చర్చ అనంతరం జరిగిన ఓటింగ్‌లో ఇండియా కూటమి ప్రతిపక్షాల తిరస్కారంతో వీగిపోయింది. ఈ డిలిమిటేషన్‌తో దేశ రాజకీయ చిత్రపటాన్ని తనకు అనుకూలంగా మార్చుకొని, లబ్ధి పొందాలన్న బిజెపి కుట్రలను ప్రతిపక్షాలు వమ్ము చేయటం ఎంతో హర్షనీయం. తన కుయుక్తులు ప్రజలకు అర్థం కాకుండా ఉండేందుకు మహిళ రిజర్వేషన్ ముసుగు కప్పుకొని బిజెపి ఆడిన నాటకాలు యావత్ భారతావనికి తెలిసిపోయాయి. 2014 ఎన్నికల ప్రచారంలో 33.3 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో బిజెపి ఇచ్చిన హామీ ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు! ఇప్పుడైనా 33.3% సీట్లు మహిళలకు కేటాయించి ఆచరణలో తమ చిత్తశుద్ధిని బిజెపి నిరూపించుకోవాలి.

ఇక ఈ బిల్లును లోతుగా పరిశీలిస్తే రూపం వేరు- సారం వేరు. ఈ డిలిమిటేషన్ ద్వారా బిజెపికి రాజకీయంగా ప్రాబల్యం ఉన్న ఉత్తరాది హిందీ రాష్ట్రాలలో పెరిగిన జనాభా ఆధారంగా సీట్లు పెంచుకొని, తమ అధికారాన్ని శాశ్వతంగా స్థిరపరుచుకోవాలనేదే బిజెపి కుట్ర. ఆది నుంచి సువిశాల భారతావనిలో దక్షిణ, ఈశాన్య భారతం బిజెపికి కొరకరాని కొయ్యగా ఉంది. ఎంత ప్రయత్నించినా దక్షిణ, ఈశాన్య భారతంలో బిజెపి బలంగా ప్రవేశించలేకపోయింది. కులము, మతము, దేవుడు, మైనారిటీ ప్రజలపై వివక్ష, ద్వేషం, విద్వేషం, గోది మీడియా విష ప్రచారము ఇవేమీ బీజేపీకి నాలుగు ఓట్లు తెచ్చి పెట్టలేకపోయాయి. ఒక కర్ణాటక మినహా, అది కూడా ఇప్పుడు చేజారిపోయింది. దక్షిణాదిలో తమకి అవకాశం లేని చోట సినీ గ్లామర్, పలుకుబడి ఉన్న వారిని అడ్డం పెట్టుకొని నాలుగు సీట్లు సాధించుకోవడం మినహా ఈ పార్టీకి ఎటువంటి ప్రజా పునాది మొదటినుండి ఈ రాష్ట్రాలలో లేదు. కారణం కేరళలో మొదటి నుండి కమ్యూనిస్టుల ప్రాబల్యం బలంగా ఉంది. తమిళనాడులో పెరియర్ రామసామి భావజాల ప్రభావంతో పుట్టిన ద్రవిడ పార్టీలు ఇక్కడ బలంగా ఉన్నాయి. దాదాపు ఆరు దశాబ్దాల నుంచి ఏదో ఒక ద్రవిడ పార్టీయే ఇక్కడ అధికారంలోకి వస్తూవుంది. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో త్రిపురనేని, విద్యాసాగర్, గోరా, రావిపూడి, రామకృష్ణ మాస్టర్ లాంటి హేతువాద, నాస్తికుల ప్రభావం, మహోన్నత కమ్యూనిస్టు ఉద్యమాలకు పుట్టినిల్లుగా ఉండటం. దేశానికి దశ దిశ నిర్దేశించిన అపూర్వ త్యాగమూర్తులు నాగిరెడ్డిగారు, సుందరయ్య గారు, ప్రాణాలు సహితం తృణప్రాయంగా అర్పించే విప్లవ కమ్యూనిస్టులు పుట్టిన నేల. ఈ త్యాగమూర్తుల త్యాగాలు వృధాపోవు కదా. ఈ నేల ఎన్నటికీ సనాతన ధర్మానికి తలవంచదు, చోటు ఇవ్వదు. మత విద్వేషాలు ఇక్కడ పనిచేయవు అని చరిత్ర నిరూపించింది. పైపెచ్చు ఈ రాష్ట్రాలు దశాబ్దాలుగా

జనాభా నియంత్రణను పాటిస్తూ, విద్య, వైద్యం వివిధ రంగాలలో అభివృద్ధిలో దూసుకు పోతున్నాయి. ఇది బిజెపికి మింగుడు పడటం లేదు. అందుకే ఈ కుట్ర రాజకీయానికి తెరలేపింది. అలాగే ఈ శాన్య రాష్ట్రాలు ఆది నుంచి భిన్న తెగలు, సంస్కృతుల సమ్మేళనం. ఇక్కడ కూడా ఆయా ప్రాంతీయ పార్టీల మీద ఆధారపడాల్సిన పరిస్థితి బీజేపీది. జార్ఖండ్‌లో జే.ఎం.ఎం, ఢిల్లీ, హర్యానాలలో ఆప్, బెంగాల్లో మమతా బెనర్జీలు బిజెపిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

ఈ తరుణంలో మహిళా రిజర్వేషన్ ముసుగులో నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) పేరుతో బిజెపికి రాజకీయంగా ప్రాబల్యం ఉన్న ఉత్తరాది హిందీ ప్రాంతాలలో సీట్లు పెంచుకోవటం, చారిత్రకంగా బిజెపికి అవకాశం లేని దక్షిణ, తూర్పు, ఈశాన్య ప్రాంతాలలో సీట్ల సంఖ్యను తగ్గించడానికి మోడీ సర్కార్ కుట్ర పన్నింది. ఇలా దక్షిణ, తూర్పు ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నించిన ఈ నీతిలేని ఎత్తుగడలను ప్రతిపక్ష ఇండియా కూటమి తిప్పికొట్టడం మంచి పరిణామం. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు ఈ కుట్రకు సహకరించటం శోచనీయం. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టడమే. ప్రజలు ఈ నీతిమాలిన పనులను అసహ్యించుకుంటారు. ఇప్పుడైనా ఈ పార్టీలు బిజెపితో చెలిమి ధృతరాష్ట్ర కౌగిలి అని తెలుసుకోవాలి. ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతీయ పార్టీలను బిజెపి స్వాహా చేసుకుంటూ వస్తూ ఉంది. గతంలో చంద్రబాబుకు ఒక చేదు అనుభవం కూడా ఉంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ పార్టీలు బిజెపి విష కౌగిలి నుండి బయట పడాలి. అసలు బిజెపి సైద్ధాంతిక పునాది లోనే 'ఒకే దేశం- ఒకే పార్టీ- ఒకే నేత- ఒకే భాష-(హిందీ) అంటూ తన మితవాద భావజాలాన్ని లౌకిక విలువలు గల దేశంపై రుద్దే ప్రయత్నం చేస్తూ ఉంది. అయితే విజ్ఞత గల ఈ దేశ పౌరులు, ముఖ్యంగా దక్షిణ, ఈశాన్య ప్రజలు దీనిని ప్రతిఘటిస్తున్నారు.

ఈ డిలిమిటేషన్ ద్వారా ఉత్తరాదిలో సీట్లు భారీగా పెరిగిపోతాయి. బిజెపి తన అధికారాన్ని శాశ్వతం చేసుకొని, దక్షిణ ఈశాన్య భారతంపై పెత్తనం చేస్తుంది. దక్షిణాది రాష్ట్రాలు తమ హక్కుల కోసం కేంద్రంలోని బిజెపి ముందు మోకరిల్లి అడుక్కునే దుస్థితి నెలకొంటుంది. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల నుండి కేంద్రానికి ఆదాయం ఎక్కువ లభిస్తున్నప్పటికీ, కేంద్రం ఇచ్చే వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోంది.

ఈ రాష్ట్రాలు తీవ్ర ఆర్థిక వివక్షతను ఎదుర్కొంటున్నాయి. ఇది ఎంతో అప్రజాస్వామికం. దక్షిణాది ప్రజలు ఆర్థికంగానే కాకుండా, రాజకీయంగా కూడా వివక్ష ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకే దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవించవలసి ఉంటుంది. ప్రాంతీయ అసమానతలు పెరిగిపోతాయి. ఇది రాజ్యాంగ సమైక్య స్ఫూర్తికి విరుద్ధం. అలాగే ఈ డిలిమిటేషన్ వల్ల పార్లమెంటు సీట్ల సంఖ్య 543 నుండి 850 కి పెరిగితే సామాన్య ప్రజలకు ఒరిగేది ఏమిటి...? ప్రజాధనం వృధా తప్పితే చట్టసభలకు ఎటువంటి వ్యక్తులు ఎన్నికవుతున్నారో, వారు ప్రజలకు ఎంత జవాబుదారీతనంగా ఉంటున్నారో, దేశ ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఏదైనా బిజెపి చేస్తున్న ఈ కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, దక్షిణాది ప్రజలు తమ ఆర్థిక, రాజకీయ హక్కులను కాపాడు కోవాలి. అలాగే బిజెపి సనాతన ధర్మం నుండి దక్షిణాది ప్రజలు తమ భాషలను, సంస్కృతులను, అస్తిత్వాన్ని కాపాడుకోవాలి. అందుకు దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పోరాడాలి. తమ ఉనికిని రక్షించుకోవాలి. మొత్తంగా బిజెపి ధృతరాష్ట్ర విషకౌగిలి నుండి దేశం విముక్తి పొందాలి. ●

దేశంలో భక్తి రసం డ్రైనేజీలా ప్రవహించకుండా అడ్డుకట్ట వేయలేమా!

- ముప్పాళ్ళ భార్గవశ్రీ,

విశ్రాంత సుప్రీంకోర్టు జడ్జి ఎన్వి రమణ ఈమధ్య గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వధర్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన "ధర్మజ్యోతి 2026" పురస్కార ప్రధానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందర్భంగా మాట్లాడుతూ.. మా చిన్నప్పటి కంటే అధిక సంఖ్యలో దేవాలయాలు పెరిగాయి. భక్తులు గుడులకు వెళుతున్నారు. అయినప్పటికీ సమాజంలో అశాంతి, అభద్రత, అరాచకం పెరిగిపోయాయి.. అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనాటి పరిస్థితులను చూసినప్పుడు ఆయన ఆ విధంగా ఆవేదన పడటంలో అర్థం ఉంది కదా!

జనరల్‌గా మనం గమనిస్తే ఏ హాస్పటల్‌కి వెళ్ళినా రోగులతో కిక్కిరిసిపోయి ఉంటున్నాయి. అలానే ఏ దేవాలయానికి వెళ్లినా భక్తులతో కిటకిటలాడిపోతుంటాయి. అలానే ఎన్వి రమణ గారు ఆవేదన పడినట్లు సమాజములో అశాంతి, అభద్రత, అరాచకాలు నానాటికి పెరిగిపోతూ ఉండటంతో ప్రశాంత జీవనం ప్రసాదించమని ప్రజలు తాము నమ్మే దేవుళ్ళ దగ్గరకు వెళ్లి మొక్కుకోవటం పెరిగిపోతూ ఉంది. ప్రజల్లో తాముండే పరిసర ప్రాంతాలలో ఉండే ఆచార వ్యవహారాలను బట్టి, చిన్నప్పటినుండి తమ కుటుంబం కొలిచే దేవుళ్ళ పట్ల నమ్మకాలను ఏర్పరచుకుంటారు. గతంలో రాజులు మొదలుకొని భూస్వామ్య వర్గాల వరకు దేవాలయాల సంస్కృతిని పెంచి పోషిస్తూ వచ్చారు. తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థ పెరుగుతూ వచ్చినా తమ అవసరాల కోసం ఫ్యూడల్ వ్యవస్థతో అంటకాగుతూ వచ్చిన ఫలితంగా దేవాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చివేశారు. గ్రామాల మొదలుకొని పట్టణాల వరకు ఆసుపత్రులు, పాఠశాలలు కంటే కొత్త కొత్త దేవాలయాలు వెలుస్తున్నాయి. బాధలతో సతమతమవుతున్న ప్రజలకు దేవుడే దిక్కు అన్న పరిస్థితిని మన పాలకులు కల్పిస్తున్నారు. దేవాలయాలకు హుండీలలో రికార్డ్ స్థాయిలో నిధులు పెరుగుతున్నాయి అంటే వివిధ రంగాల ప్రజల సమస్యలు మరింతగా పెరుగుతున్నాయనేదే దీని అర్థం. ఇప్పుడున్న దేవాలయాలు చాలవు అన్నట్లు మరిన్ని దేవాలయాల నిర్మాణాలకి భక్తులు అడిగిందే తడవుగా అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇందుకు తమ అధీనంలో ఉన్న ప్రపంచంలోనే సంపన్నుడైన వెంకటేశ్వర స్వామి దేవస్థానం వితరణతో మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాలలో కూడా దేవాలయాలను ఉద్యమంగా నిర్మిస్తున్నారు. సమస్యలతో సతమతం అవుతున్న ప్రజలలో దేవుడే దిక్కు అనే పరిస్థితిని కల్పించడం కాదా!

ప్రముఖ అభ్యుదయ కవి అమరుడు గజ్జల మల్లారెడ్డి ఏనాడో చెప్పినట్లు.. తెలుగు నాట భక్తి రసం.. తెప్పలుగా పారుతుంది. డ్రైనేజీ స్కీము లేక డేంజర్‌గా మారుతుంది.. అని దేశంలో దైవభక్తి డ్రైనేజీ వరదలా పారుతుందని అభివర్ణించాడు. ఆనాటి కంటే ఈనాడు మరింత ఉధృతంగా ప్రవహిస్తున్న విషయం అందరూ గమనిస్తున్నదే! గజ్జల మల్లారెడ్డి కంటే ఈనాడు

గొంతులు పెరిగినా ఆ ఉధృతిని ఆపలేకపోతున్నాయి. గతంలో కంటే రోగాలు పెరగటానికి, అన్నిటికంటే క్యాన్సర్ మహమ్మారి జడలు విప్పి కరాళ నృత్యం చేయటానికి, అనేక కొత్త కొత్త మందులు కనిపెడుతున్నా ఆయుష్షును కొంతకాలం పెంచగలుగుతున్నారే కానీ నివారించలేక పోతున్నారు. అధిక శాతం ప్రజలకు సమతుల్య ఆహారం లభించకపోవడం, బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడుతున్న పాలకవర్గ పార్టీల విధానాల ఫలితంగా గాలి నీరు అడవి సమస్త రంగాలు కాలుష్యం బారిన పడటంతో ప్రజల జీవితాలు గాలిలో దీపాలలా తయారయ్యాయి. కావున ప్రజలు ఎదుర్కొంటున్న ఈ ముఖ్యమైన మౌలిక సమస్యలను పరిష్కరించకుండా ఉన్నంతకాలం హాస్పిటల్స్ .. అలానే దేవాలయాలు కిటకిటలాడుతూనే ఉంటాయి కదా!

నేడు దేశంలో నూటికి ఎనభై శాతం ప్రజల సమస్యలు నానాటికి పెరిగిపోతూనే ఉన్నాయి. పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ప్రజల ఆర్థిక స్థితిగతుల మధ్య అంతరాలు పెరిగిపోతూ పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత కుబేరులుగా మారిపోతున్న సత్యాన్ని మనం కళ్ళారా చూస్తున్నాం. సాధారణ ప్రజలకు తమ జీవితాలు నానాటికి కొడిగట్టి పోవటానికి పాలకుల విధానాలే కారణమన్న సత్యం తమకు తెలియనంత కాలం, ఎప్పటినుంచో పుక్కిటి పురాణాలు వంట పట్టించుకున్న మన పెద్దలు మన పేదరికానికి, సమస్యలకు కారణం మనం పూర్వ జన్మలో చేసుకున్న పాపమే అని ఉగ్గుపాలతో నూరిపోస్తున్నారు. కావున పూర్వజన్మలో చేసిన పాపాలు, ఇప్పుడు పడుతున్న కష్టాలు పోవాలంటే దేవుడే దిక్కు అన్న మూఢ నమ్మకంతో ప్రజలు ఉన్నంతకాలం దేవుని గుళ్ళు కిటకిటలాడుతూనే ఉంటాయి కదా! అలానే ప్రజలు ఆ విధంగా మూఢనమ్మకాలలో ఉన్నంతకాలం తమ సమస్యలకు మూల కారణమైన పాలకులపై తిరుగుబాటు ఆలోచనలు చేయలేరు. ఇదే పాలకులకు కావలసినది. అందుకే గుళ్ళు గోపురాలను పోటీపడి నిర్మిస్తున్నారు.

శాస్త్రీయ విజ్ఞాన రంగాలలో ఎన్నో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నా, మనిషి చంద్రుడితో సహా అనేక ఉపగ్రహాల రహస్యాలను కనుగొంటున్నా, అనేక విజయాలు సాధిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలతో సహా సుప్రీంకోర్టు జడ్జిలు మొదలుకొని వివిధ రంగాలలో రాణిస్తున్న మేధావులు పూజలు పునస్కారాలు చేయటం దేనిని సూచిస్తుంది! శాస్త్రవేత్తలే పూజలు పునస్కారాలు చేస్తుంటే మరి సామాన్య మానవుడి పరిస్థితి ఏమిటి! ప్రజలలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించనంత కాలం మూఢవిశ్వాసాలు కొనసాగుతూనే ఉంటాయి. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలకు మూల కారణాలు తెలుసుకోకుండా చేయటానికే పాలకులు గుళ్ళు నిర్మిస్తూ భక్తి రసాన్ని ఏరుల్లా ప్రవహింప చేస్తూనే ఉంటారు!

కావున ఎన్వి రమణ గారు వాపోతున్నట్లు సమాజంలో అభద్రత, అవినీతి, అరాచకం, అశాంతి ప్రబలకుండా ఉండాలంటే ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి వామపక్ష శక్తులతోపాటు వివిధ రంగాలలో ప్రజాతంత్రవాదులు, హేతువాదులు, నాస్తికవాదులు చేస్తున్న కృషి నిరంతరం ఉద్యమంలా సాగించటానికి కంకణం కట్టుకోవాలి! మార్క్స్ మహనీయుడు అన్నట్లు మత్తుమందులాంటి మతంతో పాటు మనువాదాన్ని పెంచి పోషించటానికి బిజెపి అనుబంధ సంస్థలు పక్కా ప్రణాళిక ప్రకారం యజ్ఞములా చేస్తున్న "కరసేవ"ను అధిగమించేలా ప్రజాస్వామ్య శక్తులు ముందడుగులు వేసినప్పుడే ఈ పరిస్థితికి విముక్తి లభిస్తుంది! •

మచ్చా లక్ష్మయ్య 'క్రాంతికార్' ఎలా అయ్యాడు ?

(క్రాంతికార్‌తో నా అనుభవాలు)

– కన్నెబోయిన అంజయ్య

నిజాం రాజు పరిపాలనలో రజాకార్ల అరాచకాలకు ఎదురునిలిచి పోరాడి నేలకొరిగిన మచ్చా వీరయ్యగారు జన్మించిన పోరాటాల పల్లెటూరు ఖమ్మం జిల్లాలోని గోకినపల్లె. ఆ వీరుడిని, ఆ పల్లెను కథలు కథలుగా నాట్లు వేస్తు కోకిల రాగాలతో పాటలు పాడేవారు. అలాంటి పల్లెటూరు, కమ్యూనిష్టులకు కంచుకోట అదే ఇంటిపేరున ఉన్నత రైతు కుటుంబం మచ్చ నాగయ్య–జానకమ్మగారల సంతానంలోని మచ్చా లక్ష్మయ్యగారే ఈ క్రాంతికార్. ఉద్యమ నేపథ్యం ఉన్న కుటుంబం కావటం వలన అభ్యుదయం, ఆదర్శం, మానవతా విలువలకు, కమ్యునిస్టు ఆశయాలకు కలబోతగా మచ్చా లక్ష్మయ్య జీవితప్రస్థానం మొదలైంది. విద్యనభ్యసిస్తూనే యుక్త వయస్సు కల్ల గొప్ప ఆదర్శ భావాలు గల వ్యక్తిగా రూపుదిద్దుకున్నారు.

అతని వివాహంలో ఆదర్శం చోటుచేసుకుని అదే గ్రామానికి చెందిన చావా కోటయ్య, స్వరాజ్యలక్ష్మిగారల కుమార్తె ఝాన్సిగారిని ఆదర్శ వివాహం చేసుకున్నాడు. ఉన్నత చదువు చదివిన ఝాన్సిగార్కి కాలేజి లెక్చరర్ ఉద్యోగం రాగా వారు ఖమ్మం రావడం జరిగింది. స్వతహాగా ఉద్యమ ఆసక్తి ఉన్న మచ్చా లక్ష్మయ్య ఉవ్వెత్తున లేచిన నక్సలైటు ఉద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. లక్ష్మయ్య కూడా ఉన్నతంగా చదివిన కారణంగా నక్సలైట్లు పార్టీ విప్లవ పత్రికకు బాధ్యుడ్ని చేయటంవలన అనతికాలంలోనే అగ్రనాయకుల స్థాయికి ఎదిగారు.

సికింద్రాబాద్ కుట్రకేసులో ముద్దాయిగా ప్రభుత్వం జైల్లో పెట్టింది. ఒక దశలో లక్ష్మయ్యను ఎన్‌కౌంటర్ చేయ సిద్ధమైన విషయం ఝాన్సిగార్కి తెలిసి ఆమె బంధువుల పలుకుబడితో ఆ ప్రమాదం నివారించగలిగినట్టు చెప్పుకున్నారు.

అజ్ఞాతంలో గడుపుతూనే ఎన్నోసార్లు జైలు జీవితాన్ని గడిపారు. ఆ విధంగా నక్సలైటు నాయకునిగా ముద్రవేసుకున్నారు. ఈ క్రమములోనే కొండపల్లి సీతారామయ్య, రాయల సుభాష్ చంద్రబోసు, గద్దర్, శ్రీశ్రీ ఇంకా ఎంతోమంది విప్లవయోధులను కలుసుకొని చర్చలు జరిపినట్టు, ఆ విధంగా హేతువాద ఉద్యమాలలో కూడా చురుకుగా పనిచేస్తూ మచ్చా లక్ష్మయ్య పేరు ఆధ్యాత్మికతకు చిహ్నమని పేరు మార్చుకుని వెలుగునిచ్చె పదం అయిన క్రాంతిని కలుపుతూ క్రాంతికార్ అనే నామకరణంగా మార్చుకున్నాడని తెలుసుకున్నాను.

హేతువాద ఉద్యమంలో క్రాంతికార్‌తో కలిసి నేను ఉద్యమించాను. ఆనాడు గొప్ప విప్లవ గాయకుడుగా పేరున్న గద్దర్‌ను ఖమ్మం తీసుకొచ్చి గొప్ప సభ నిర్వహించాం. నేను, క్రాంతికార్ దళిత నేతలను కలుపుకుని నిర్వహించిన సభ సక్సెస్ అయినది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో కత్తి పద్మారావు, యస్. వి.రావు; వల్లంపట్ల, వేదాంత, గుత్తా రాధాకృష్ణ, భానుప్రసాద్, హను, రామక్రిష్ణా, గోరా మొ॥లగు వారి ద్వారా ఉవ్వెత్తున లేచిన హేతువాద ఉద్యమం, కారంచేడు ఘటనతో ఉద్యమం చీలిపోయి హేతువాద ఉద్యమం స్తబ్ధతకు గురైంది. అప్పటివరకు ఉద్యమానికి అండదండల నిచ్చిన కమ్యునిష్టులు దూరమయ్యారు.

నేను, క్రాంతికార్ విజయవాడలో ఉన్న గుత్తా రాధాకృష్ణగార్ని ఖమ్మం తీసుకొచ్చి ఉద్యమాన్ని పునర్ నిర్మించాం. గుత్తాగారు నేను క్రాంతికార్ ఇంటిని కేంద్రంగా చేసుకుని సత్యాన్వేషణ మండలి వ్యవస్థాపకులు పుట్టా సురేంద్రగారితో కలిసి వంచనా ప్రతిఘటన ఐక్య వేదికను నిర్మించాం. తెలుగునాట కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్న దొంగ బాబాలపై సమరశంఖం పూరించాం. కల్కి భగవాన్‌గా అవతారమెత్తిన విజయకుమార్ బండారం బయటపెట్టాం. తెలుగునాట వాస్తు పిచ్చి ముదిరి కట్టిన ఇంటి నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చుకునే సంస్కృతి మొదలైంది. వాస్తును బలపరుస్తూ తిరుపతిలో జరిగిన ప్రపంచ వాస్తు సభలను సవాల్ చేసి ఆ సభలోనే కట్టిన ఇంటికి వాస్తు చూడకూడదని వారితోనే ప్రకటన చేయించాం. ఐక్య ఉద్యమాల వల్ల ఫలితాలు సాధించగలమని నిరూపించాం. క్రాంతికార్, గుత్తా రాధాకృష్ణ, పుట్టా సురేంద్ర, నేను, బల్లెం సామ్యేలు, భాను, సత్తుపల్లి వెంకటేశ్వర్రావు ఇలా అనేక మంది ఉద్యమం నడుపుతూ సైన్సు హేతువాదం పత్రికను నడిపాం. కమ్యూనిస్టు పార్టీలు సహకరించినప్పుడు గ్రామాలలో మూఢనమ్మకాలపై సభలు సమావేశాలు క్రాంతికార్ నేను కలిసి అనేక సభలు నిర్వహించాం. నిప్పులపై నడక క్రాంతికార్ ప్రత్యేకత.

గైగోళపల్లి సంజాతండాలో రోజూ ఇండ్లు తగలబడుతూ ఖమ్మం కలెక్టరు, ఉన్నతాధికారులకు సవాల్‌గా మారినప్పుడు కలెక్టరు పర్మిషన్‌తో ఆ గ్రామంలో సభ నిర్వహించి మంటలకు కారణాన్ని విశదీకరించి నివారించగలిగాం. క్రాంతికార్ చొరవ ఇక్కడ గొప్పది, చిమ్మపూడి గ్రామంలో నిప్పులమీద నడక సమయంలో క్రాంతికార్‌ను నిప్పుల్లోనే నిలిపి చంపాలని చూశారు కొందరు అరాచకవాదులు. క్రాంతికార్‌గారి చొరవతో మదరాసు, బొంబాయి, ఒరిస్సాలలో – సభలకు హాజరయ్యాం.

భద్రాచలంలో ఏటిపాకలో అతిరాత్రం అనే యాగాన్ని పాలకుల అండతో కేరళ నంబూద్రి బ్రాహ్మణులను వేలాదిగా రప్పించి, లక్షల జనాలను రప్పించి చేసే యాగాన్ని సవాల్ చేయాలని క్రాంతికార్, భానుప్రసాద్, నేను ఢీకొట్టే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న హేతువాదులంతా ప్రాంతీయవాదంలో చిక్కుకుని మాకు సహరించలేదు. సవాల్ స్వీకరించమని సభ నిర్వహించగా సభపై అరాచక శక్తులు దాడిచేసి సభను భగ్నం చేశారు. భాను, క్రాంతికార్, నన్ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

క్రాంతికార్ నన్ను కలుపుకుని అనేక సభలు నిర్వహించారు. తెలంగాణ వచ్చిన తరువాత పెద్ద ఎత్తున ఖమ్మంలో సభ నిర్వహించి నూతన తెలంగాణ హేతువాద సంఘం అధ్యక్షునిగా నన్ను ఎన్నుకున్నారు.

క్రాంతికార్ తన జీవితాన్ని ఉద్యమాలకు అంకితమిచ్చారు. ఝాన్సిగారు, క్రాంతికార్ కట్టిన ఇంటికి 'బుద్ధ నిలయం' అని పేరెట్టారు. వారికి ఒక బాబు, ఒక పాప జన్మించారు. వారికి పేర్లు పెట్టేక్రమంలో వారి ఆదర్శభావాలు కనబరిచారు. బాబు పేరు గౌతమ్ అని, పాపపేరు జ్వలిత అని పెట్టుకున్నారు. ఝాన్సిగారు జాబు చేస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులను చేసింది.

ఝాన్సీగారి మరణంతో క్రాంతికార్ ఒంటరి అయినా, మతగ్రంథాలను ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువాదం చేసి ముస్లిమ్‌ల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సమయంలో క్రాంతికార్, నేను ప్రెస్ క్లబ్‌లో ఉన్నాం. క్లబ్బును చుట్టుముట్టిన పోలీసులు ఇద్దర్ని అరెస్టు చేశారు. అనువదించి ముద్రించిన పుస్తకాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం పట్టణం అంతా అల్లకల్లోలమయింది. శాసన సభలో ముఖ్యమంత్రి ఎవరీ క్రాంతికార్ అని ఆరాతీశారు. అల్లర్లకు కారణమంటు క్రాంతికార్‌ను జైలుకు పంపి నన్ను విచారించి వదిలివేశారు.

కమ్యూనిస్టులకు కంచుకోట అయిన ఖమ్మంలో ఇది అన్యాయమని ఎవరూ ఖండించలేదు. ఖమ్మంలో జరిగిన ఈ ఘటన అన్యాయమంటూ క్రాంతికార్‌ను సమర్థిస్తూ నలబై పేజీల పుస్తకం రాశాను. అయినా ఆ పుస్తకం అచ్చువేయటానికి రెండు రాష్ట్రాల ముద్రణాలయముల చుట్టూ తిరిగాను, నిరాకరించారు. వరంగల్లులో మాత్రం ఒక ప్రెస్ ధైర్యంతో ముద్రించింది. ఆ పుస్తకాలను తెలుగు ప్రజలకు పంపించాను. రంగనాయకమ్మగారు (మార్క్సిస్టు తత్వవేత్త) నాకు ఫోన్ చేసి రాసిన తీరును మెచ్చుకుంటూ అభినందించింది.

నేను, హను, రమణారావు మరికొందరు లాయర్లు శంకర్, సుగుణారావులను సంప్రదించి బెయిల్ ద్వారా, క్రాంతికార్‌ని వరంగల్ జైలు నుండి బయటకు తీసుకువచ్చాం. మూఢనమ్మకాలపై సాగుతున్న ఈ ఉద్యమాన్ని పోలీసులను పురమాయించి కేసులు పెడుతున్నారు. అణిచివేస్తున్నారు. హేతువాదం అంటే వాస్తవాన్ని మాట్లాడటమే. ఎవరైన తెలుసుకునే వారు శాంతియుత చర్చలతో ముందుకు వస్తే సత్యం తెలుసుకోవచ్చు. క్రాంతికార్ మరణం హేతువాద ఉద్యమానికి తీరని లోటు. ఆరోగ్యం కాపాడుకునే క్రమంలో క్రాంతికార్ విఫలమయ్యారు అని అందరూ భావించారు. నేను చివరికంటూ క్రాంతికార్‌ను ఆదర్శంగా తీసుకుంటాను. సెలవ్. •

ఆస్తికుడు - నాస్తికుడు

- సురేందర్ ఉయ్యాల

నింగిన ఎగిరే పక్షులు ఎన్నో, ఆ పక్షులకు గూడునిచ్చే వృక్షాలెన్నో
తీరం చేరే కెరటాలు ఎన్నో, ఆ తీరాన ఉన్న ఇసుక రేణువులెన్నో
నేలపైనున్న జీవులు ఎన్నో, ఆ జీవులు చేసే వింతలు ఎన్నో
కురిసే వానలో చినుకులు ఎన్నో, ఆ చినుకులు నింపే కొలనులు ఎన్నో
సూర్య కాంతిలో కిరణాలు ఎన్నో, ఆ కిరణాలిచ్చే వెలుగులు ఎన్నో
అంతరిక్షంలోని గ్రహాలు ఎన్నో, ఆ గ్రహాల చుట్టూ తిరిగే ఉపగ్రహాలెన్నో
ప్రకృతిలోని అందాలెన్నో, ఆ అందాలిచ్చే ఆనందాలెన్నో
పరిణామంలోని తరాలెన్నో, ఆ తరాల మధ్య అంతరాలెన్నో
ఎవరిస్తారు ఈ ప్రశ్నలకు జవాబులు అంటే
ఆస్తికుడు చెబుతాడు దేవుడని, నాస్తికుడు అడుగుతాడు వాడెవ్వడని?

బైబిల్ బాగోతం

- డా॥ కోనా వీరబ్రహ్మం

(గత సంచిక తరువాయి)

34. యేసు మహిమల్ని ప్రచారం చెయ్యొచ్చా? చెయ్యగూడదా?

యేసు ప్రవచనాలు చాలా చోట్ల పరస్పర విరుద్ధంగా ఉంటాయనటానికి ఎన్నైనా ఉదాహరణలు పేర్కొనవచ్చు.

మత్తయి 9.30 ప్రకారం యేసు మహిమల్ని ప్రచారం చెయ్యకూడదు. ఆ వచనం ఇలా చెబుతోంది.. "ఇది ఎవరికిని తెలియకుండ చూచుకొనుడని వారికి ఖండితముగా ఆజ్ఞాపించెను". మత్తయి 12:16లో "తన్ను ప్రసిద్ధి చేయవద్దని వారికి ఆజ్ఞాపించెను" అని ఉంది.

లూకా 8:56 ప్రకారం కూడా ప్రచారం చెయ్యగూడదు. అది ఇలా ఉంది: "ఆయన జరిగినది (చనిపోయిన స్త్రీని బ్రతికించుట) ఎవనితోను చెప్పవద్దని వారి నాజ్ఞాపించెను".

ఐతే మత్తయి 11:4 ప్రకారం యేసు మహిమల్ని ప్రచారం చెయ్యొచ్చు. ప్రచారం చెయ్యమని ఆయన ఇలా చెప్తున్నాడు. "మీరు వెళ్ళి విన్నవాటిని కన్నవాటిని యోహానుకు తెలుపుడి".

మత్తయి 28:19లో "మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామము లోనికి వారికి బాప్తిస్మమిచ్చును" అని ఉంది.

మార్కు 5:19లో ఇలా ఉంది. "ప్రభువు నీయందు కనికరపడి నీకు చేసిన కార్యములన్నింటిని వారికి తెలియజెప్పుమనెను".

లూకా 8:39లో యేసు తన మహత్మ్యాన్ని ప్రచారం చెయ్యమని ఆదేశించాడు. "ఆయన నీవు నీ యింటికి తిరిగివెళ్ళి దేవుడు నీకెట్టి గొప్పకార్యముల జేసెనో తెలియజేయుమని వానితో చెప్పి వానిని పంపి వేసెను; వాడు వెళ్ళి యేసు తన కెట్టి గొప్ప కార్యము చేసెనో ఆ పట్టణ మందంతటను అంతా ప్రకటించెను".

35. పరలోకపు తండ్రి అసమర్థుడు, బలహీనుడు!

అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు, ఎక్కడైనా బలవంతులదే రాజ్యం. మత్తయి 11:12 ఇలా చెబుతోంది. "బాప్తిస్తమిచ్చు యోహాను దినములు మొదలుకొని ఇప్పటివరకు పరలోక రాజ్యము బలాత్కారముగా పట్టబడుచున్నది, బలాత్కారులు దాని నాక్రమించు కొనుచున్నారు". ఇలా జరుగుతోందని చెప్పబడింది కావున పరలోకపు తండ్రి లేదా యజమాని అసమర్థుడు, బలహీనుడు అని నిర్ధారించవచ్చును.

36. బాప్తిస్మము పుచ్చుకోవటమంటే మారుమనస్సు పొందటమేనా? అది పొందటానికి ముక్కు మూసుకొని నీళ్ళల్లో మునగాలా? లేక గోనెపట్టా కట్టుకొని వంటినిండా బూడిద పూసుకోవాలా?

రెండోదే చెయ్యాలని మత్తయి 11:21లోను, లూకా 10:13లోను స్వయానా యేసుక్రీస్తే సెలవిచ్చాడు. మత్తయి 11:21లో ఇలా ఉంది. "మీ మధ్యను చేయబడిన అద్భుతములు తూరు, సీదోను పట్టణములలో చేయబడిన యెడల ఆ పట్టణముల వారు పూర్వమే గోనెపట్టా కట్టుకొని బూడిద వేసికొని మారుమనస్సు పొంది యుందురు".

37. దేవుడు తన సంగతులు వివేకులకు మరుగుచేసి, పసి బాలురకు బయలు పరచినాడట! దీని పరమార్థం ఏమిటి? వివేకులకు చెబితే వచ్చే నష్టం?

దేవుడు తన సంగతులు జ్ఞానులకు, వివేకులకు చెబితే వచ్చే నష్టం ఏమిటంటే, వాళ్ళు

ఏం చెబితే అది నమ్మరు. వారికి విచక్షణా శక్తి ఉంటుంది కాబట్టి వాళ్ళు సత్యాన్ని మాత్రమే గ్రహిస్తారు. పసిపిల్లలు మూగమొద్దులు. వారికి బయలుపరచేదేమిటి? అందువల్ల ఒరిగే లాభమూ లేదు. జరిగే నష్టం అసలే ఉండదు. ఇవి దేవుని మాటలు అని యేసు పెద్దలకు చెప్పే సంగతులు, పిల్లలకు దేవుడు ముందే చెప్పాడని ఒక మాట అడ్డువేయటం వల్ల పెద్దల్ని తేలిగ్గా నమ్మించవచ్చని యేసు పన్నాగం ఇది. మత్తయి 12:25లో ఇలా ఉంది. "తండ్రీ, ఆకాశమునకును, భూమికిని ప్రభువా! నీవు జ్ఞానులకును, వివేకులకును ఈ సంగతులను మరుగు చేసి పసి బాలురకు బయలు పరచినావని నిన్ను స్తుతించుచున్నాను".

38. సాత్వికుడు, దీన మనస్సుగల వాడు ఇతరుల మీద ఎక్కుతాడా?

కాడిమోసే వాడి ప్రాణాలకు హాయి ఉంటుందా? నేర్చుకోవాలంటే గురువును నెత్తికెత్తుకోవాలా? మత్తయి 12:29లో యేసు ఇలా అంటాడు. "నేను సాత్వికుడను. దీన మనస్సు గలవాడను గనుక మీమీద నాకాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి, అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును". నా మాటలలో యేసు భాషణం: నేనెంతో సున్నితమైన హృదయం గలవాణ్ణి. నా దగ్గర మీరు నేర్చుకోవాలనుకుంటున్నారు. నేనెక్కిన బండికాడి మీ భుజాలకెత్తుకోండి. నెమ్మదిగా మోసుకెళ్ళండి. మీకు అట్టే శ్రమ అన్పించదు. హాయిగా ఉంటుంది.

39. మనుష్యులు ఏ పాపమైనా చెయ్యొచ్చు; కానీ దేవుణ్ణి మాత్రం తిట్టగూడదట!

మత్తయి 12:31లో ఇలా ఉంది. "మనుష్యులు చేయు ప్రతి పాపమును దూషణయు క్షమించ బడును గాని ఆత్మ (ఇక్కడ ఆత్మ అనగా దేవుడు) విషయమైన దూషణకు పాప క్షమాపణ లేదు".

40. చెడ్డవారు మంచి మాటలు పలుకగూడదా? కూడదంటున్నాడు యేసు. యేసు క్రీస్తుకు కూడా జాతి వివక్ష ఉంది!

మత్తయి 12:34లో యేసు ఒక తెగవారిని నీచంగా సంబోధిస్తూ ఇలా అంటున్నాడు. "సర్ప సంతానమా! మీరు చెడ్డవారైయుండి ఏలాగు మంచిమాటలు పలుకగలరు?"

ఈ క్రింద పేర్కొన్న మరో వాక్యం యేసుకు గల జాతి వివక్షను, జాత్యహంకారాన్ని తెలియజేస్తోంది. "మీరు (సమరయులు) మీకు తెలియని దానిని ఆరాధించువారు, మేము (యూదులు) మాకు తెలిసిన దానిని ఆరాధించువారము, రక్షణ యూదులలో నుండియే కలుగు చున్నది". యోహాను 4:22

యేసుకేకాదు, ఆయన శిష్యులకు కూడా సంకుచిత భావాలుండేవి. ఒక తెగ ప్రజలను కించపరుస్తూ అదే తెగలోనుంచి వచ్చిన పౌలు కూడా ప్రవక్త మాట్లాడిన మాటలను సమర్థించాడు. తీతుకు 1:12 లో చూడండి. "కేతీయులు ఎల్లప్పుడు అబద్ధికులును, దుష్టమృగములును, సోమరులగు తిండిపోతులునై యున్నారు. ఈ సాక్ష్యము నిజమే".

41. ఈ పతనావస్థకు కారణమెవ్వరు? దేవుడేగదా?

మత్తయి 12వ అధ్యాయంలో 44, 45 వచనానలలో ఇలా ఉంది "ఆ యింట (మృతదేహం) ఎవరును లేక అది ఊడ్చి అమర్చియుండుట చూచి, వెళ్ళి తనకంటె చెడ్డవైన మరి యేడు దయ్యములను వెంటబెట్టుకొని వచ్చును. అది దానిలో ప్రవేశించి అక్కడే కాపురముండును. అందుచేత ఆ మనుష్యుని కడపటి స్థితి మొదటి స్థితికంటే చెడ్డదగును".

దేహం లోపల ఊడ్చి అమర్చటం ఎవరికి సాధ్యం? దేవుడికి తప్ప. కాబట్టి ఈ దుస్థితికి కారణం దేవుడే గదా! (ఇంకా వుంది)

మతం గుప్పిట్లో మహిళ

(గత సంచిక తరువాయి)

– కొల్లా వెంకటేశ్వర్లు

ఇస్లాం మతం

హిందూ మతం స్త్రీలను ఆవుతో పోల్చితే, క్రైస్తవమతం గర్భనిరోధం మహాపాపమంటే ఇస్లాం మతం స్త్రీలను జంతువులతోను, దున్నే పొలంతోను పోల్చింది. ఈ మత సిద్ధాంతం ప్రకారం స్త్రీలు పరదా వేసికోవాలి. స్వేచ్ఛగా ప్రవర్తించరాదు. చదువుకొనరాదు. తన అభిప్రాయాలు బహిరంగంగా ప్రకటించుకోరాదు.

ముస్లింల పవిత్రగ్రంథం ఖురాను. అందులో యీ క్రింది విధంగా రాసారు.

"ముస్లింలు తమ బానిస స్త్రీలను చెరచవచ్చును. నేరం కాదు. (ఖురా. 18.23.6)

"బానిస స్త్రీలను అమ్ముకొనవచ్చును" (ఖురా 33.25)

షరియా చట్ట ప్రకారం పెళ్ళి, విడాకులు, ఆస్తి మొదలైన విషయాలన్నింటిలో స్త్రీకి స్వతంత్రత లేదు. ఈ చట్టప్రకారం పురుషులు నలుగురు స్త్రీలను పెళ్ళాడవచ్చు. యిష్టం వచ్చినపుడు భార్యకు విడాకులివ్వవచ్చు. ఒక వేళ భర్త మరణిస్తే భార్యకు అతని ఆస్తిలో 8వ వంతు మాత్రం వస్తుంది.

ఆయుబ్‌ఖాన్ తన "స్నేహితులు – యజమానులు కారు" అనే పుస్తకంలో స్త్రీల దుస్థితిని వివరించారు.

"ముస్లిం చట్టం మూలంగా స్త్రీల పరిస్థితి దారుణమౌతుంది. స్వార్థపరులైన పురుషులు మాత్రం సుఖపడుతున్నారు. ఈ బహుభార్యాత్వం కారణంగా వేల కుటుంబాలు నాశనమౌతున్నాయి" అన్నారు.

"భగవంతునిచే మహమ్మదునకు ఖురాన్ పంపబడిందని ముస్లింల నమ్మకం. ఆ ఖురాన్ ఆధారంగా రూపొందించబడిన షరియా చట్టంలో మార్పులు తేవడం నేరమని ముస్లింల విశ్వాసం."

హిందూ, క్రైస్తవ మతాల్లోని సూక్తులకు యే మాత్రం తీసిపోని విధంగా ఉన్నాయి ఖురాన్ వాక్యాలు.

"మీ ఆడవారు మీకు సాగుభూమి వంటి వారు. మీరు కోరినట్లు సాగు భూమివద్దకు రండి"

సురాత్ అల్ బకారా – 2 : 223 శ్లోకం

"ఆదిలో అల్లా ఏడంను పుట్టించి అతనినుండి ఏవా (మహిళ) ను పుట్టించాడంటుంది" ఖురాను.

"పురుషులు తమ సంపదను స్త్రీలకోసం ఖర్చు చేస్తున్నందున ఆడవారిపై మగవారి కధికారముంటుంది. కనుక మంచి స్త్రీలు పురుషులకు విధేయులు. వారు తమ శరీరాంగాల్ని కప్పుకొంటారు. ఆ విధేయులైన స్త్రీలను భయపెట్టు. పడకమీద ఎడంగావుంచు, కొట్టు" అంటుంది "పవిత్ర" ఖురాను.

"వ్యభిచారం విషయంలో నలుగురు మగాళ్ళు సాక్ష్యమివ్వాలి. ఆడది సాక్ష్యమిస్తే చెల్లదు." (సురాత్ అన్–నూర్ . 24 : 4)

"ఒక ముస్లిం సంస్కరణవాది (పురుషుని) సాక్ష్యం క్రిమినల్ కేసులో చెల్లుతుంది గాని, నీతిపరురాలైన, దైవభీతి గల ఆడదాని సాక్ష్యం చెల్లదు."

"మగవాడు వ్యభిచరిస్తే బహిరంగంగా రాళ్ళు విసరి చంపబడాలి. ఆడది వ్యభిచరిస్తే, నడుంవరకు భూమిలో ఒక గోతిలో నిలిపి రాళ్ళతో కొట్టి చంపాలి"

"భార్యలు వ్యభిచరిస్తే వారు మరణించే వరకు, దేవుడు వారికో దారి చూపించే వరకు వారిని తమ గదుల్లో వుంచి మూసెయ్యాలి" (సురాత్. అన్ నిసా. 4:19)

"ముస్లిం స్త్రీ పరదాతో తనను తాను కప్పుకోవాలి. ఒళ్ళంతా గాని, మొహం మాత్రం గాని, కనుపించకుండా పరదాలో దాచుకోవాలి"

"భర్త భార్యతో నీకు విడాకులు (తలాక్) ఇస్తున్నాను" అంటే చాలు విడాకులిచ్చినట్లే లెక్క.

"ఒక మగవాడు "నలుగురు భార్యలనే గాక యెంత మంది ఉంపుడు గత్తెలనైనా కల్గియుండవచ్చు".

ఈ ముస్లిం చట్టాన్ని మార్చవలసిన అవసరం ఎంతో వుంది. అక్కడక్కడా కొన్ని దేశాలు మాత్రం చట్టాన్ని కొంత సడలించినా మన దేశంలో మాత్రం సడలింపు జరుగనేలేదు. ఇస్లాం చట్టాన్ని మార్చడమంటే ముస్లింలను మున్ముందు హతమార్చడానికి ప్రయత్నం జరుగుతున్నట్లే నని మన దేశంలోని ముస్లిం నాయకులు అంటున్నారు. చట్టాలు, ఆచారాలు సామాన్యజనాన్ని యెంతగా బిగిస్తే, మతనాయకుల వైభవాలు అంతబాగా సాగుతాయి. అందుకే ప్రభుత్వాలు కూడా మతాలను యెక్కువ మోతాదులో సమర్ధిస్తున్నాయి.

ఏ మతానికీ కోపంరాకుండా ఆకాశవాణి వారు అన్ని మతాలను ప్రచారం చేసికోనిస్తుంది. సంస్కృత భాష పేరుతో శవసంస్కృతిని, శృంగార చేష్టలను ప్రసారం చేస్తుంది. ఒకవైపు స్త్రీని గౌరవించాలంటూ సంగీతం పేరిట, కీర్తనల పేరిట బూతును ప్రచారం చేస్తుంది. స్త్రీని ఇనుప కచ్చడాల మధ్య బిగించిన మతాలకు ప్రాధాన్యతనిస్తుంది.

మన దేశం మతవు వాసనలతో, కులం కుళ్ళుతో నిండి పోయింది. "మేం గొప్పవారం" అని డాంబికాలు పలికే పురషుల ఇళ్ళలోనూ స్త్రీల విషయము వచ్చేసరికి బానిసత్వమే కొనసాగుతుంది. ప్రపంచంలో కెల్ల స్త్రీని గౌరవించే దేశం మనదేనని చెప్పుకోవడం అవకాశవాదమే. శాంతి, అహింసల పేరుతో జాతిని నీరుగార్చి, మతం పేరుతో మత్తుజల్లి, తమ కబంధ హస్తాలతో స్త్రీజాతిని సమ్మెట పోటు పొడుస్తున్నారు మతవాదులు. •

అనుమానమున్నోని ఆలిభాదలు తెలియ
రామాయణము చదివి తీరవలయు
జూదము పేకాటశక్తి తెలియాలన్న
భారతమ్మును చదివి తీరవలయు
మహిమలు మహాత్యాల మర్మాలు తెలియగ
బాబాలు స్వాములు అవ్వలన్ చదవర
మూఢనమ్మకాల ముప్పు తెలియాలన్న
హేతువాదంజన్న జీవితం చదవరా

– కన్నెబోయిన అంజయ్య

చర్చ: వైద్య విధానంలో గతితార్కిక పద్ధతి-హోమియోపతి

(గత సంచిక తరువాయి)

– మంజీర

సూక్ష్మమోతాదులు సురక్షితమైనవి.. శాస్త్రీయమైనవి.

మందు మోతాదుల విషయంలో కూడా అల్లోపతి, హోమియోపతిలవి విరుద్ధమైన పద్ధతులే. వాటి పునాదిలోనే అది యిమిడి వుంది. వైరుధ్య పద్ధతి ప్రకారం మందు ఎంత ఎక్కువగా ఇస్తే రోగాన్ని నిర్మూలించగలం అనేది సమస్యగా వుంటుంది. కాబట్టి, పెద్ద మోతాదులు ఇవ్వాలి. సారూప్య పద్ధతిలో మందు మోతాదు జీవశక్తిని పెంపొందించగలంత తక్కువగా వుంటే చాలు, కాబట్టి సూక్ష్మ మోతాదులు వుంటాయి. దీనినే 'సూక్ష్మతా నియమం' అంటారు.

'పెద్ద మోతాదులు రెండు విధాలైన చెడు ఫలితాలను కలిగిస్తున్నాయని ఇప్పటికే వైద్య ప్రపంచం గుర్తించింది. పెద్ద మోతాదుల వల్ల తొలగించబడిన వ్యాధి, మందు శక్తి తగ్గగానే తిరిగి తలెత్తడం కనిపిస్తుంది. ఈ క్రమంలో వ్యాధి రెసిస్టెన్స్ పెరిగితే, మరింత పెద్ద మోతాదులు ఇవ్వడమో, మరో కొత్త మందును వెతుక్కోవడమో చేయక తప్పదు. యాంటీ బయాటిక్స్ వాడకంలో ఇది అందరి అనుభవంలోకి వచ్చిన విషయమే. పెద్ద మోతాదుల వల్ల వ్యాధులు అణచివేతకు గురై మరో రూపంలో బయటపడడం కూడా జరుగుతుంది. చర్మ వ్యాధులు అణచివేతకు గురై మరోరూపంలో బయటపడడం కూడా జరుగుతుంది. చర్మ వ్యాధులు అణచబడి ఆస్తమాగా మారడం, కీళ్ళనొప్పులు అణచబడి గుండె జబ్బుగా మారడం హోమియోపతి వైద్యులు మొదట్లోనే తమ అనుభవంలో గుర్తించారు. కాబట్టి వైరుధ్య పద్ధతిలో పెద్ద మోతాదుల వలన వ్యాధులు అణచివేతకు గురై, శరీరం తన శక్తిని కోల్పోయి, మరింతగా వ్యాధులకు గురవుతుంది.

సారూప్యమైన మందు జీవశక్తి ద్వారా పని చేస్తుంది కాబట్టి, సూక్ష్మమోతాదు సరిపోతుంది. దీనిని శాస్త్రీయంగా కూడా నిరూపించవచ్చు. పరిమాణం పెరిగితే గుణం మారడమన్నది ప్రకృతి సహజసూత్రం. ఇపెకాక్ అనే వృక్ష సంబంధమైన మందు వుంది. ఈ మందు పెద్ద మోతాదులో వాడితే వాంతులవుతాయి. ఒకటి, రెండు చుక్కలు వీటిలో కలిపి ఇస్తే వాంతులవుతున్న రోగికి వాంతులు ఆగిపోతాయి. ఈ కారణంగా అల్లోపతిలో కూడా ఈ మందును సూక్ష్మమోతాదులోనే గర్భిణీ స్త్రీల వాంతులకు వాడుతారు. సూక్ష్మమోతాదుల అవసరాన్ని డా॥ హానిమన్ ఆచరణ క్రమంలో గుర్తించాడు. వ్యాధి సోకిన కణాలు సున్నితంగా వుండి, పెద్ద మోతాదులకు తీవ్రంగా స్పందిస్తాయి. వ్యాధిసోకని కణాలు కూడా మందు ప్రభావానికి గురవుతాయి. దీనినే రియాక్షన్, సైడ్ ఎఫెక్ట్స్ అంటారు. కాబట్టి మందు మోతాదు జీవశక్తిని కదిలించగలిగినంత సూక్ష్మంగా వుంటే చాలు. అదే రోగకణాలను స్పందింపజేయ గలుగుతుంది. ఇతర కణాలపై ప్రభావం కలిగించదు. డా॥ హాన్స్‌సెలీ ప్రయోగాలు కూడా చిన్నమోతాదుల అవగాహనను సమర్థించేవే. చిన్నమోతాదులపై హోమియోపతి అవగాహన శాస్త్రీయమైనది. దానిని డా॥ హానిమన్ మరింత అభివృద్ధి చేసి "శక్తి గుణీకరణ (పోటెంటైజేషన్) ప్రక్రియ"ను అభివృద్ధి చేసాడు. ఇది హోమియోపతి శాస్త్రాన్ని మరింత సంపద్వంతం చేసింది.

పోటెంటైజేషన్ (శక్తిగుణీకరణ) ప్రక్రియ

డా॥ హానిమన్ 1796లో సారూప్యౌషధ సిద్ధాంతాన్ని ప్రపంచానికి వెల్లడించి, ఆ పద్ధతిలోనే వైద్యం చేస్తుండేవాడు. అందుకు మొదట గాఢ ద్రావణాలనే వాడుతుండేవాడు. "సూక్ష్మతా నియమాన్ననుసరించి వైద్యం చేస్తున్నప్పటికీ, వాటి ఒరిజనల్ రూపంలో వాడడం వలన మందులు కొన్ని సైడ్ఎఫెక్ట్స్ కలిగించడం, అవి సూచించబడిన రోగాలకు శక్తివంతంగా పనిచేయడంలో లోపం వుండడం గమనించాడు. అదే సమయంలో మానవ శరీరంపై తీవ్రప్రభావం కలిగించే విషాలను మందులుగా ఉపయోగించడంలో వున్న సమస్యను కూడా గుర్తించాడు. కాబట్టి పదార్థంలో గుప్తంగా వున్న శక్తిని బయటికి తీయడానికి, సైడ్ఎఫెక్ట్ లేకుండా చేయడానికి, విషాలను ప్రకృతిలో జడత్వంతో కనిపించే పదార్థాలను శక్తివంతమైన మందులుగా మలచడానికి, మందులను పలచబరచిన రూపంలో వాడడం మంచిదని భావించాడు. ఆ క్రమంలో తాను చేసిన ప్రయోగాల ఫలితంగా 1813లో శక్తి గుణీకరణ (పొటెంటైజేషన్) ప్రక్రియను ప్రవేశపెట్టాడు. ఈ ప్రక్రియ వలన పదార్థంలో గుప్తంగా వున్న శక్తి బయటికి వచ్చి మరింత శక్తివంతంగా పనిచేస్తుండడం వలననే దానికి శక్తిగుణీకరణ ప్రక్రియ అని పేరుపెట్టాడు. ఆర్సెనిక్ విషాన్ని 2 నుండి 4 వర్ల గింజల పరిమాణంలో తీసుకుంటే మనిషి చనిపోతాడు. దీనిని మందుగా మలచిన ప్రక్రియను డా॥ హానిమన్ మాటల్లోనే చూద్దాం..

"గ్రైనులో 10వ వంతు ఆర్సెనిక్ చాలా కేసులలో అపాయకరమైనదైతే, గ్రైనులో 1000వ వంతు అంతకన్న నిరపాయకరమైనది కాదా! అది కూడా ప్రమాదకరమైనదైతే మోతాదు పరిమాణం ఇంకా తగ్గించడం వల్ల నిరపాయకరమైనది అవదా?"

"ఇక (అతిశక్తివంతమైన ప్రతి ఔషధ పదార్థం లాగానే) మోతాదుల పరిమాణాన్ని తగ్గించడం వల్ల మాత్రమే, ఆర్సెనిక్ ప్రాణాపాయం కాజాలనంత నిరపాయకరమైనదైతే, మోతాదును ఎంతవరకు తగ్గిస్తే, అది హానిచేయకుండా అది సరిపోయే వ్యాధులకు సంపూర్ణ ప్రజ్ఞావంత మగు మందుగా పనిచేయగలదో, అంతవరకు మోతాదును తగ్గించవలసి వుంటుంది. దానిని మాత్రమే మనం (ఆచరణ) అనుభవాన్ని బట్టి కనుగొనవలసి వుంటుంది.."

ఈ అవగాహనతో డా॥ హానిమన్ మందును సూక్ష్మీకరించేందుకు పోటెంటైజేషన్ ప్రక్రియను రూపొందించాడు. దీనిలో డెసిమల్ పద్ధతి, సెంటిస్మల్ పద్ధతి వున్నాయి. సెంటిస్మల్ పద్ధతిని తెలుసుకుందాం. ఒక వంతు ఒరిజనల్ మందు ద్రావణానికి 99 వంతుల ఆల్కహాల్ కలిపితే 1వ పొటెన్సీ మందు తయారవుతుంది. ఇప్పుడు 1వ పొటెన్సీ మందు, ఒక వంతుకు మళ్ళీ 99 వంతుల ఆల్కహాల్ కలిపితే రెండవ పొటెన్సీ మందు తయారవుతుంది. ఇలా ఆల్కహాలు కలిపి గట్టిగా కుదపడం ద్వారా మందు భాగం మిగిలిన ఆల్కహాల్' భాగంలో, సమాన భాగాలుగా విడిపోయి కలసిపోతుంది. ఈ విధంగా అవసరమైన స్థాయివరకు పొటెన్సీలను పెంచుతూ పోవచ్చు. ఇలా 1 నుండి లక్ష వరకూ కూడా పొటెన్సీలు వున్నాయి. రోగం తీవ్రతను బట్టి, అది తరుణ వ్యాధా, దీర్ఘ వ్యాధా అన్న దానిని బట్టి వైద్యుడు పొటెన్సీలను ఉపయోగపెడతాడు. అత్యంత పెద్ద పొటెన్సీలో అసలు మందే లేదని సాధారణ ఆలోచనకు అనిపిస్తుంది. కానీ అది అత్యంత శక్తివంతంగా పనిచేస్తుంది కాబట్టి నెలకో డోసు, ఆర్నెల్లకో డోసు ఇవ్వడం కూడా జరుగుతుంది. (ఇంకావుంది)

ముహూర్తాలు ముప్పు

– అంజయ్య కన్నెబోయిన

ముహూర్తాల పిచ్చి వొదులుకోండి మా అన్నలు
ముహూర్తాల ముప్పు తెలుసుకోండి మా అక్కలు
ముహూర్తము చూసుకుని పుట్టలేదు కద నువ్వు
ముహూర్తము చూసుకుని చావబోవు కద నువ్వు
మధ్యన ఈ ముహూర్తాల మంత్రాల గొడవలేంది
మంచిదని పుష్కరాల్లో మునిగి చచ్చినోళ్ళెందరు ॥ముహూ॥

పెండ్లి ఊసు ఎత్తితే బాపనయ్య కావాలి
పూలు పండ్లు పెట్టాలంటే అయ్యవార్లు కావాలి
సాంప్రదాయం ఆచారాలు మంత్రాలతో పెండ్లి చేస్తే
కట్నం కోసం భార్యను చంపెవాన్కి ముహూర్తమేది ॥ముహూ॥

ఏరువాక సాగాలన్నా విత్తనాలు నాటాలన్నా
పంటలు కోయాలన్నా ధాన్యం తేవాలన్నా
కదిలితే మంచిరోజు మెదిలితే మంచి రోజు
నోరు మంచిదైతే ఊరు మంచిదన్నరేనాడో ॥ముహూ॥

గొప్ప గొప్ప మునులు రుషులు చక్కని ముహూర్తం బెట్టి
సీతారాముల కళ్యాణం చక్కగ జరిపించినారు
వనవాసం చేసి వారు కాయా కసురులు నమిలిరి
కష్టాలతో ఇల్లు చేర అనుమానంతో ఆలినొదిలె ॥ముహూ॥

ముడుపులు చెల్లిద్దామని ముహూర్తము పెట్టుకుని
ఏడుకొండలెంకన్న దర్శనాని కెళ్తు ఉంటే
అదుపు దప్పినా లారీ అడ్డంగా గుద్దిపోతే
మంచి ముహూర్తములోనే మన కథ కంచికిబోయె ॥ముహూ॥

రాహుకాల మంటు బాబా పాద ధూళికై ఎగబడి
నెట్టుకుంటు తొక్కుకుంట భక్తజనం తోపులాట
నూటా ఇరవైమంది ప్రాణాలు ఎగిరిపోయె
ఇహలోకం పరలోకం రెంటి మధ్య నలిగిపోయె ॥ముహూ॥

Editor, Printed & Published by : **B. Sudhakar,** Printed at
MYTRI ART PRINTERS, Mahaboobnagar.